




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 131 | ది. 25-8-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 131 | Date : 25-8-2026 | Tuesday | Pages : 8 | Rs.1/-


# అంతర్జాతీయ మార్కెట్లకు ఏ.పి.వ్యవసాయ ఉత్పత్తులు

- ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో గ్లోబల్ బ్రాండ్లుగా మారాలి
- దేశీయ రకం హైబ్రీడ్ పాప్ కార్న్ మొక్కజొన్న విత్తనాలు విడుదల
- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు







**నూజివీడు, ఆగష్టు 24 (వార్తాప్రభ) :** మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ము-ఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్ కార్న్‌కా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్‌కా సంస్థ ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స్ పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ..." రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. కొండవీటి కొయ్య బొమ్మలు లాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర : సీఎం రేవంత్ రెడ్డి

- తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై కేంద్రంపై మండిపడ్డ రేవంత్
- కేంద్రం తనను అడ్డుకున్నా, తన లక్ష్యాన్ని అడ్డుకోలేరని వ్యాఖ్య
- మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని సీఎం ఆగ్రహం



**హైదరాబాద్,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్రలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్రం తనను అడ్డుకున్నా, తన లక్ష్యాన్ని మాత్రం అడ్డుకోలేరని అన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తామన్నారు. తన విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యతా లేదని, మొత్తం షెడ్యూల్?ను విదేశాంగశాఖ ముందుంచామన్నారు. లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్? చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్రం, మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

**4 కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం..** తెలంగాణ ము-ఖ్యమంత్రికి విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడమనేది 4 కోట్ల ప్రజలకు జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని అడ్డుకోవడం అంటే అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ప్రధాని మోదీ ఇప్పటికే ఎన్నో దేశాల్లో పర్యటించారని, ఆయన సొంత రాష్ట్ర సీఎం కూడా ఎన్నో దేశాల్లో పర్యటించారన్నారని రేవంత్ రెడ్డి అన్నారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి తమకు ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్ ఫ్యూచర్?సిటీలో పెట్టుబడులకు ఎన్నో సంస్థలు ఆసక్తి చూపించాయని వివరించారు. మన యూనివర్సిటీలతో ఒప్పందానికి విదేశీ వర్సిటీలు ఆసక్తి చూపాయన్నారు. ప్రఖ్యాత వర్సిటీలతో ఎంవోయూలు చేసుకునేందుకే తాను అమెరికా పర్యటన తలపెట్టినట్లుగా వివరించారు. విదేశీ వర్సిటీలు మన వద్దకు వస్తే, మన విద్యార్థులు అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారు..** ప్రధాని మోదీ గుజరాత్?కు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్ రాష్ట్రానికే రావాలని చూస్తున్నారన్నారని ఆరోపించారు. తన పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతామన్నారు. యూకే, యూఎస్? పర్యటనకు ఒకే తరహా వివరాలిచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. లండన్? పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. రాజకీయ కారణంతోనే అనుమతి ఇవ్వటం లేదని విదేశాంగశాఖ బదులిచ్చిందన్నారు. అసలు రాజకీయ కారణం అంటే ఏమిటి? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాను తెలంగాణ సీఎం, కాంగ్రెస్? ముఖ్యమంత్రిని కావటమే రాజకీయ కారణమా అని ప్రశ్నించారు. "వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారు. పెట్టుబడుల కోసం గుజరాత్ సీఎం అమెరికాలో 8 రోజులు పర్యటించారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి, తెలంగాణ సీఎంను ఎందుకు అడ్డుకున్నారు. తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని కేంద్రం, మోదీ పదేపదే ప్రదర్శిస్తోంది. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకునేందుకు కుట్ర చేశారు. నన్ను అడ్డుకోవటం, గుజరాత్ ఆధిపత్యానికి నిదర్శనం. రాజకీయ వివక్షతో తెలంగాణను మోదీ అడ్డుకుంటున్నారు. కేంద్రం వైఖరిపై రాష్ట్ర బీజేపీ నేతలు నోరెత్తకపోవటం మరింత అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు.

**కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారు..** కేంద్రంలో ఉన్న కొందరు బీజేపీ నేతలు తన అధికార పర్యటనపై అవాస్తవాలు చెప్పి కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. విదేశీ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలు స్పష్టంగా పేర్కొన్నామన్నారు.

# అంతర్జాతీయ న్యాయ సేవలకు హైదరాబాద్ వేదిక

- ఏఐ ఆధారిత కేంద్రం ద్వారా వివిధ దేశాల న్యాయ నిపుణుల సేవలకు అవకాశం
- సాంకేతిక ఆధారిత ప్రొఫెషనల్ సేవలకు హైదరాబాద్ అంతర్జాతీయ హబ్‌గా ఎదిగే సామర్థ్యం ఉంది
- 'కావేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్'ను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**హైదరాబాద్‌ఆగష్టు 24 (వార్తాప్రభ) :** అంతర్జాతీయ న్యాయ నైపుణ్యాన్ని కృత్రిమ మేధ సాంకేతికతతో అను-సంధానం చేస్తూ, వివిధ దేశాలకు సంబంధించిన న్యాయ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'కవేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్' హైదరాబాద్ కార్యాలయాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ న్యాయ సేవలకు సంబంధించిన వినూత్న సంస్థ హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వృత్తిపరమైన సేవలతో సహా అనేక రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం వేగంగా విస్తరిస్తోందని, ఇది అపారమైన అవకాశాలను సృష్టిస్తూనే కొత్త సవాళ్లను కూడా ముందుకు తెస్తోందన్నారు. అందువల్ల ఏఐ వినియోగంలో బాధ్యత, నైతిక విలువలు, పారదర్శకత అత్యంత కీలకమని పేర్కొన్నారు. బలమైన ఐటీ, సాంకేతిక వ్యవస్థ, అత్యున్నత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ దేశాలతో మెరుగైన అనుసంధానం హైదరాబాద్‌కు ప్రత్యేక బలాలని మంత్రి చెప్పారు. ఈ అనుకూలతలతో ఏఐ ఆధారిత ప్రొఫెషనల్, న్యాయ సేవలకు హైదరాబాద్ ఒక ప్రధాన అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. తెలంగాణను అంతర్జాతీయ నైపుణ్యంతో అనుసంధానించే ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రపంచస్థాయిలో మరింత గుర్తింపు తీసుకొస్తాయని అన్నారు. న్యూయార్క్‌లోని కావేటి లా ఫర్మ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ అటార్నీ డాక్టర్ శ్రీనివాస్ రావు కవేటి, కవేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడాన్ని మంత్రి అభినందించారు. తెలంగాణకు చెందిన డాక్టర్ కవేటికి భారత్‌తో పాటు అమెరికా, య-ునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, కెనడా, యూఏఈ దేశాలకు సంబంధించిన అంతర్జాతీయ న్యాయ వ్యవహారాల్లో 35 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని 'ఇంటర్నేషనల్ లీగల్ యాక్సెస్ హబ్ గా తీర్చిదిద్దాలని సంస్థ ప్రతిపాదించింది. భారత్‌లోని వ్యక్తులు, వ్యాపార సంస్థలు, ప్రవాస భారతీయులు, పెట్టుబడిదారులు వివిధ దేశాల్లో న్యాయ సేవలు అందిస్తున్న న్యాయవాదులు, న్యాయ నిపుణులతో అనుసంధానం కావడానికి ఈ కేంద్రం వేదికగా పనిచేయనుంది. అంతర్జాతీయ న్యాయ నిపుణులు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భాల్లో ప్రత్యక్ష సంప్రదింపులు, న్యాయ వ్యూహాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించే అవకాశాన్ని కూడా కల్పించనున్నారు. సంస్థ సేవలు వివిధ దేశాల్లోని పలు న్యాయ విభాగాలను కవర్ చేయనున్నాయి.

# శాఖల్లో సమర్ధత - సేవల్లో నాణ్యత

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం డేటా ఇంటిగ్రేషన్
- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం



**అమరావతి,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ఏఐ అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్ చెయిన్... వంటి సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ సేవలు మరింత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబంధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికేట్స్ అప్‌లోడ్ చేసే పని లేకుండా డేటా ఇంటిగ్రేషన్ జరగాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ సమీక్షలో వివిధ శాఖల పనితీరు, పురోగతి గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలు మరింత సమర్ధత పెంచుకోవాలని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

**క్రాప్ అలర్ట్‌లపై పర్యవేక్షణ..** ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో పంటల పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈసారి వ్యవసాయ దిగుబడులు సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందించగలమని చెప్పారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సమృద్ధిగా నీరందించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే సాగు మొదలు పెట్టని చోట వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలని నిర్దేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు క్రాప్ అలర్ట్ పంపడంతో పాటు దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇందుకోసం ఏపీటీఎస్ అనలిటిక్స్ కూడా వినియోగించుకుని... అవేర్‌తో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. తాగునీటి వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు.

# కొండా సురేఖకు షాక్ ఇచ్చిన సర్కార్



**హైదరాబాద్, ఆగష్టు 24 (వార్తాప్రభ) :** మంత్రి కొండా సురేఖకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. కొండా సురేఖకు సమాచారం లేకుండానే ఆమె పరిధిలోని శాఖలో డిప్యుటేషన్ పై పనిచేస్తున్న పన్నెండు మంది ఉన్నతాధికారులను వారి మాతృసంస్థకు వెళ్లాలని ఆదేశించారు. ఈరోజు ఉదయం మంత్రి కొండా సురేఖ తన ఇంట్లో నుంచి వనమహోత్సవంపై అటవీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అయితే కొండా సురేఖకు మాత్రం తనశాఖలో పనిచేస్తున్న వారిని బదిలీ చేసినట్లు ఆమెకు అప్పుడు తెలియలేదు. అయితే ప్రభుత్వ ఉన్నతాధికారులు అటవీ శాఖలో డిప్యూటేషన్ పై పనిచేస్తున్న అధికారులను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. కొండా సురేఖ దేవాదాయ శాఖతో పాటు అటవీ శాఖను కూడా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

# ఏపీలో పలు సంచలనాత్మక కేసుల్లో ఈడి దూకుడు కేంద్ర పెద్దల ఆదేశాలా.. ? వైసీపీలో టెన్షన్!





**అమరావతి, ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ఏపీలో పలు సంచలనాత్మక కేసుల్లో ఈడి దూకుడు ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కలవరం ప్రారంభం అయింది.గతంలో కేవలం రాష్ట్ర దర్యాప్తు సంస్థలు, ప్రత్యేక దర్యాప్తు బృందాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన కుంభకోణాలపై దర్యాప్తు చేసేవి. కానీ కేంద్రం పరిధిలోని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ హఠాత్తుగా కొత్త వేగం ప్రదర్శిస్తుంది. ప్రధానంగా మద్యం కుంభకోణంలో.. 195 కోట్ల రూపాయలకు పైగా విలువైన మద్యం అక్రమ రవాణా కేసులు మాజీ మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు అరెస్టు కావడం సంచలనంగా మారింది. ఇప్పటికీ ఆయన కుమారుడు సునీల్ కూడా అరెస్టయ్యారు. ప్రధానంగా ఫ్రైడ్ ఇన్ఫ్రాకాన్ లాంటి సంస్థల చుట్టూ ఉచ్చు బిగించడం ఒక ఎత్తు అయితే.. ఏళ్ల తరబడి మూలనపడి ఉందనుకున్న వివేకానంద రెడ్డి హత్య కేసులో మనీ ట్రయల్ కోణాన్ని ఈడి వెలికితీస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**సిబిఐ ను కాదని ఈడి..** వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణను సిబిఐ చేపడుతోంది. అయితే సంతృప్తికరమైన దర్యాప్తు జరగలేదు అనేది వివేకానంద కుమార్తె సునీత వాదన. ఆమె ప్రతిసారి న్యాయస్థానాలను ఆశ్రయిస్తూనే ఉన్నారు. అయితే ఏం చేయలేమన్న నిస్సహాయత సిబిఐ నుంచి వచ్చింది. దీంతో ఈ కేసు క్లోజ్ అయినట్టేనని అంతా భావించారు. కానీ ఇప్పుడు తెరపైకి ఈడి వచ్చింది. కడప ఎంపీ అవినాష్ ఇంట్లో సోదాలు చేసి,నగదు తో పాటు రెండు డిపాజిట్ లాకర్లను స్వాధీనం చేసుకోవడం తో ఈ కేసును కేవలం హత్య కేసు గానే కాక.. ఫైనాన్షియల్ క్రైమ్ గా మార్చేశాయి. అసలు ఏపీ కేంద్రంగా ఈడి ఈ స్థాయి ఆర్థిక ఉగ్రవాద ఎందుకు వేగవంతం చేసింది? దీని వెనుక ఉన్న అసలైన సంకేతాలేంటి? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. తప్పకుండా తెరవెనుక ఏదో ఒక టార్గెట్ ఉంటుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

**రూ. 40 కోట్ల సుపారీ..** తాజాగా వివేకానంద రెడ్డి హత్య కేసులో ఈడి ఎంట్రీ తో.. ఒక అంశం వెలుగులోకి వచ్చింది. రూ.40 కోట్ల సుపారి చేతులు మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇది వ్యవస్థాగతంగా సాగుతున్న మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నమోదైన సాధారణ కేసు అని తెలుస్తోంది. సిబిఐ దర్యాప్తు చేస్తున్న ఈ కేసులోకి ఈడి రావడం అంటే చిన్న విషయం కాదు. మరోవైపు మద్యం రవాణా టెండర్లను స్థానిక సిండికేట్లకు కట్టబెట్టిన కిలోమీటర్ కు 13 ఉండే చార్జిని 35 రూపాయలకు పెంచి,వైసిపి హయాంలో 195 కోట్ల రూపాయలు పక్కదారి పట్టించారు అనేది ప్రధాన ఆరోపణ. అయితే మద్యం కుంభకోణం కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేపడుతోంది. ఇంకోవైపు ఈడి ఆర్థిక లావాదేవీలతో పాటు నేరపూరిత ఆదాయం, వ్యాపార సామ్రాజ్యాల్లోకి హవాలా లావాదేవీలు, డిజిటల్ నెట్వర్క్ పై దృష్టి పెడుతూ విచారణ చేపట్టింది ఈడి. ఇలా ఏకకాలంలో రెండు కేసులను ఈడి దర్యాప్తు చేపడుతుండడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆందోళనకు కారణం. ఢిల్లీ పెద్దల ఆదేశాలు రాకుండా.. ఈడి ఎంట్రీ ఇచ్చే అవకాశం లేదు.

# రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం




**హైదరాబాద్,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పథకాలపై తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబాకర్ పథకాలపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు.. వాటికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యేలు ఇవ్వడమేంటని ప్రశ్నించింది. దీనికి సంబంధించిన చెక్కులను అధికారులు ఇవ్వకుండా ఎమ్మెల్యేలు ఇవ్వడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఈ చెక్కుల పంపిణీ అంశంలో సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది. అదే సమయంలో దివ్యాంగులకు ఇచ్చే ఆర్థికసాయం కొనసాగించేందుకు అనుమతించిన తెలంగాణ హైకోర్టు.. జీవో నంబర్ 4పై ఉన్న స్టేను ఎత్తివేసింది. కాగా, ఈ నెల ఆరంభంలో ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే. ఆగస్టు 7వ తేదీన ఒక కేసు విచారణ సందర్భంగా.. కోటీశ్వరులు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని వ్యాఖ్యానించింది.

## ఏలూరు నగర ప్రజలకు అందుబాటులో "కేఎన్ఆర్ ఫ్యాబ్రిక్ మాల్"





**ఏలూరు,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** నగర ప్రజలకు నాణ్యమైన ఫ్యాబ్రిక్ బట్టలను సరసమైన ధరలకు అందించేందుకు కేఎన్ఆర్ ఫ్యాబ్రిక్ మాల్ అందుబాటులోకి వచ్చింది. ఏలూరు నగరంలోని విజయ విహార్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కేఎన్ఆర్ షాపింగ్ మాల్‌ను సోమవారం ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణ సతీమణి బడేటి మీనా కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు నిర్వాహకులు అంజనేయులు, విజయలక్ష్మి మాట్లాడుతూ తమ వద్ద ఆధునిక డిజైన్లు, నూతన మోడళ్లతో కూడిన ఫ్యాబ్రిక్ బట్టలను నేరుగా కంపెనీల నుంచి దిగుమతి చేసుకుని వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ సరసమైన ధరలకు వస్త్రాలను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఏలూరు నగర ప్రజలు కేఎన్ఆర్ ఫ్యాబ్రిక్ మాల్‌ను సందర్శించి నాణ్యమైన ఫ్యాబ్రిక్ వస్త్రాలను కొనుగోలు చేయాలని వారు కోరారు. ప్రారంభ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## అక్రమ వసూళ్ల కేసులో నిందితుడు ఉపయోగించిన వాహనం స్వాధీనం

**● కారులో తుపాకి ఉందని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం-ఎస్ఐ సుధాకర్**



**మైలవరం,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** అక్రమ వసూళ్ల కేసులో నిందితుడు ఉపయోగించిన వాహనం స్వాధీనం చేసుకున్నట్లు మైలవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె.సుధాకర్ ఆదివారం రాత్రి తెలిపారు.మైలవరం మెయిన్ రోడ్డు లోని ఒక హోటల్ కు ఒక వ్యక్తి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అని చెప్పుకుంటూ మరో వ్యక్తి తో వచ్చి అక్కడి వంటగదిని తనిఖీ చేసి ఆహార నమూనాలను సేకరించారని,తరువాత సదరు వ్యక్తి యొక్క కారు (AP16DQ3479)లో ఫిర్యాది ని కూర్చోబెట్టుకుని హోటల్‌ను సీజ్ చేస్తామని, తనిఖీ సమయంలో తీసిన ఫోటోలు/వీడియోలు ను మీడియాలో ప్రచారం చేస్తామని డబ్బులు డిమాండ్ చేసినట్లు మైలవరం పట్టణంలోని బిస్మిల్లా బిర్యాని సెంటర్ నిర్వాహకుడు అహ్మద్ అబ్బాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు Cr. No 222/2026, సెక్షన్లు: 308(2), 351(2) BNS కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించా మని ఎస్ఐ సుధాకర్ తెలియజేశారు.ఈ కేసు దర్యాప్తులో బాగంగా సదరు కారు వివరాలను ఆధునిక టెక్నాలజీ సూరక్షా 360 సి.సి. కెమెరా లలో పొందుపరచడం జరిగిందని,ఈ రోజు ఆదివారం ఉదయం సదరు కారు నున్న ప్రాంతం లో ఉన్నట్లు అలర్ట్ రావడంతో వెంటనే పోలీసు లు అప్రమత్తమై అక్కడకు వెళ్ళేసరికి పోలీసులు రాకను గమనించిన ముద్దాయి కారును వదిలేసి పారిపోయాడని తెలిపారు. కారును స్వాధీనం చేసుకుని తనిఖీ చేస్తున్న క్రమంలో పోలీసులకు తుపాకీ లాంటి ఒక బొమ్మ పిస్టల్ లభించింది. దానిని పరిశీలించగా అది ఒక తుపాకి మోడల్ లో ఉన్న సిగరెట్ లైటర్ మాత్రమేననీ,అంతేగానీ నిజమైన తుపాకి కాదని ఎస్ఐ వెల్లడించారు. ఇది ఒక తుపాకి మోడల్ లో ఉన్న సిగరెట్ లైటర్ మాత్రమే అన్నారు.ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందనీ,ముద్దాయి కుంభా గోవింద అలియాస్ వజ్రం ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

**అసత్య ప్రచారం తగదు :ఎస్ఐ సుధాకర్**

కొన్ని సోషల్ మీడియాలలో మరియు టి.వి.ఛానెల్స్ లలో కారులో నిజమైన తుపాకీ దొరికిందని అసత్య ప్రచారాలు జరుగుతున్నాయనీ,ఇది కేవలం తుపాకి మోడల్ లో ఉన్న సిగరెట్ లైటర్ మాత్రమే అని స్పష్టంచేశారు.

## ఉప రాష్ట్రపతికి కలంకారి శాలువాతో కాగిత స్వాగతం



**పెడన,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా భారత ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ సోమవారం గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర మంత్రి కేపీ సారధి ఇతర ఎమ్మెల్యేలతో కలిసి పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. ముందుగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మంత్రి నారా లోకేష్ ను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ కి ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ పెడన కలంకారి శాలువాతో ఘన స్వాగతం పలికారు.

## శెనగ గింజ శనగ నూనెలోనే వేగినట్టుంది

**-రాష్ట్ర పద్మశాలి సంఘ మాజీ అధ్యక్షులు రామకృష్ణ పెండెం**



**విస్సన్నపేట,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విశ్రాంతి తీసుకునే ఉద్యోగుల పరిస్థితి వారికి రావలసిన బెనిఫిట్స్ ఆలస్యం అవుతున్నాయని రాష్ట్ర పద్మశాలి సంఘ మాజీ అధ్యక్షులు పి ఆర్ టి ఓ అసోసియేట్ మాజీ అధ్యక్షులు పెండెం వెంకట రామకృష్ణ విచార వ్యక్తం చేశారు. వేరుశెనగ గింజలు వేరుశనగ నూనెలోనే వేగినట్లు విశ్రాంతి ఉద్యోగులకు రావలసిన సొమ్ము ఉద్యోగంలో ఉన్న అధికారులు విడుదల చేసే విషయంలో అలసత్వం వహించటం విచిత్రంగా ఉన్నది అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ప్రజలలో ఉంటారని అధికారంలో ఉన్న నాయకులు ఉద్యోగులతో ఉంటారన్నారు. భారత రాజ్యాంగం పొందుపరిచిన నిబంధనల ప్రకారం ఉద్యోగులు ప్రభుత్వానికి తెచ్చే ఆదాయాన్ని ప్రజాప్రతినిధులు ఖర్చుపెడతం జరుగుతోందని నాటి రాజుల కాలం నుండి జరిగే ప్రక్రియ ఇదేనని అయితే ప్రభుత్వ ఉద్యోగులు వారు దాచుకున్న సొమ్మును అమ్ముకున్న సెలవల సొమ్మును విడుదల విషయంలో తమలాంటి ప్రభుత్వ ఉద్యోగులే మేనమేషాలు లెక్కవేయటం ఆశ్చర్యమేస్తుందన్నారు.

## మేకపోతులు తీసుకొని డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**మైలవరం,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** మేకపోతులు తీసుకొని డబ్బులు చెల్లించకుండా మోసంచేయడమే కాకుండా మేకలు అమ్మిన వ్యక్తిపై బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై మైలవరం పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మైలవరం మండలం, పొందుగల గ్రామ శివారు అనంతరం గ్రామానికి చెందిన బాణావతు కృష్ణ (34 సంవతరాలు) మేకలను పెంచుతూ, వాటిని విక్రయించడం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. సుమారు రెండు సంవత్సరాల క్రితం మైలవరం గ్రామానికి చెందిన కుంభ గోవిందు అలియాస్ వజ్రం అనే వ్యక్తి తాను విలేకరిగా పనిచేస్తున్నానని, మైలవరంలో రెండు చికెన్/మటన్ షాపులు కూడా నిర్వహిస్తు న్నానని బాణావతు కృష్ణ తో పరిచయం పెంచు కున్నాడు.ఈ పరిచయంతో వజ్రం మేకపోతులు కావాలని మొదటిసారి బాణావతు కృష్ణ నుంచి 7 మేకపోతులను తీసుకొని నగదు చెల్లించాడు. అదే నమ్మకంతో రెండవసారి కూడా కుంభ గోవిందు అలియాస్ వజ్రం కృష్ణ వద్ద నుంచి 9 మేకపోతులను తీసుకొని (వాటి మొత్తం విలువ సుమారు రూ.70,000) డబ్బులు పూర్తిగా చెల్లించకుండా "తర్వాత ఇస్తాను, రేపు ఇస్తాను" అంటూ కాలయాపన చేస్తున్నాడు.డబ్బులు చెల్లించాలని ఫిర్యాదుదారుడు కృష్ణ పలుమార్లు అడగగా,అందుకు వజ్రం తాను ప్రెస్ రిపోర్టర్‌నని, తననే డబ్బులు అడుగుతావా అంటూ బెదిరించ డంతో పాటు, తనపై కేసులు పెట్టిస్తానని భయ పెట్టినట్లు, డబ్బులు అడిగిన సందర్భాల్లో పెద్దగా కేకలు వేస్తూ భయభ్రాంతులకు గురిచేసినట్లు బాణావతు కృష్ణ మైలవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.దీంతో మైలవరం పోలీసులు కుంభ గోవిందు అలియాస్ వజ్రంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

## ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం



**హనుమాన్‌జంక్షన్,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుంకర సాంబశివరాయల్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం నిర్భయంగా పోరాడిన మహోన్నత వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డి ప్రజల హక్కుల కోసం పోరాడిన ఆయనను 'ఆంధ్రకేసరి'గా ప్రజలు గౌరవించుకున్నారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన సేవలు, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి అందించిన కృషి చిరస్మరణీయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, సామాజిక సేవకు జీవితాన్ని అంకితం చేసిన ప్రకాశం పంతులు ఆదర్శాలను నేటి తరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. దేశభక్తి, ధైర్యం, నిజాయితీ, ప్రజాసేవ వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని అన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాణా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, స్థానికులు పాల్గొని ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## రికార్డులు మోత మోగాలంటే ఐక్యత అవసరం





**విస్సన్నపేట,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ఒక కార్యక్రమం విజయవంతం కావాలన్నా ఒక వ్యాపారం అభివృద్ధి చెందాలన్నా ఒక విద్యా సంస్థల స్టేట్ ర్యాంకులు కొట్టాలన్న ఒక రాజకీయ పార్టీ భారీ సీట్లు సాధించాలన్న ఎలాంటి అవరోధాలు లేకుండా ఐక్యత అవసరం అన్న విషయం అందరికీ తెలిసిందే. ఎన్నికలంటే వార్డు స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతి ఒక్క ఓటు ఒడిసి పడితేనే అత్యధిక ఓట్లు సాధించేందుకు సంపూర్ణ మెజార్టీ లక్ష్యాలను సాధించవచ్చు అని తెలుస్తోంది. ఒక్కొక్కసారి ఒక్క ఓటుతో ఓడిపోయినా వార్డు మెంబర్లు కూడా ఉండటం ప్రతి ఒక్కరం వింటూనే ఉన్నాం.అయితే మండల స్థాయి నాయకులతో గ్రామస్థాయి నాయకులు గ్రామస్థాయి నాయకులు మండల స్థాయి నాయకులు కలిసి నియోజకవర్గం స్థాయి వారితో సమిష్టి నిర్ణయాలతోనే ఓటు బ్యాంకు సాధించేందుకు అవకాశం ఉంటుందని పోల్ మేనేజ్మెంట్ లో అపార అనుభవం కలిగిన రాజకీయ మేధావులు అనుకుంటున్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీపీ జడ్పిటిసి ఎన్నికలలో గతంలో జడ్పిటిసి ఎన్నిక నేరుగా జరిగేదని రాబోయే ఎన్నికలలో గ్రామ సర్పంచ్ మరియు ఎంపీపీ అభ్యర్థులను కూడా నేరుగా ఓటరు దేవుళ్లే ఎన్నుకునే పరిస్థితి రానున్నట్లు సమాచారం అందడంతో వార్డు సభ్యులు ఎంపీటీసీలు క్యాంపు లతో పని లేకుండా సులభతరమైందని పలుచోట్ల వినిపిస్తుంది. ఓటర్లు పిలిస్తే పలికే మెరుగైన అభ్యర్థులను ఎన్నిక చేసుకునేందుకు త్రాగునీటి సమస్య డ్రైనేజీ వ్యవస్థ డొంక రహదారులు తదితరాలను పరిష్కరించగల సత్తా ఉన్న అభ్యర్థులను గెలిపించుకోవాలని అనుకోవడం జరుగుతుంది. మండల కేంద్రంలో గత గ్రామపంచాయతీ పరిపాలనలో రెండు పూటలా త్రాగునీరు ఉదయం అరగంట సాయంత్రం అరగంట సరఫరా చేసే వారని ప్రత్యేక అధికారుల పాలన సమయం కావడం భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రోజుకు 20 నిమిషాలు ఇవ్వటం కూడా కష్టంగా ఉండటం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగితే నూతన బాడీ ఎన్నికైన సందర్భంగా కొత్త బోర్లు వేసే అవకాశం ఉంటుందని అప్పటివరకు త్రాగునీటి ఇక్కట్లు తప్పవని పలుచోట్ల మాట్లాడుకుంటున్నారు. ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలే ఎన్నుకునే ప్రజా నాయకులు గద్దెనెక్కిన తర్వాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేజర్ గ్రామపంచాయతీ విస్సన్నపేటకు విడుదల చేసే నిధులతో సంపూర్ణ మౌలిక రాజకీయ వాతావరణానికి రాబోయే మండల ప్రజా పరిషత్ జడ్పిటిసి గ్రామపంచాయతీ ఎన్నికల నాటికి మార్పులు ఏమన్నా జరిగాయా అలానే ఉన్నాయా అదే జోష్ తో అదే మెజార్టీని సాధించగలమా అనే గణాంకాలు కూడా సరిచూసుకోవలసిన బాధ్యత కూటమి పార్టీల నాయకులకు ఉంటుందని చెప్పవచ్చు. సొంత ఇంటి కడల సహకారాలకు ప్రప్రథమంగా తొలి విఘ్నం తొలగిపోవాలంటే మేరువా మట్టి అవసరం ఉంటుంది. అరిస్టాటిల్ డిమాండ్ సప్లై సూత్రం ఆధారంగా మట్టి ధరలు ఉండటంతో కొన్ని పేద కుటుంబాలు పొదుపు చేసుకున్న సొమ్ము పునాదులలో పోసే మట్టికే చనిపోయే పరిస్థితి వచ్చింది. వైరు వర్గాలకు ఆ విషయం మేలు చేసేలా ఉన్నట్లు తోస్తుంది. ప్రభుత్వ పరంగా నిర్మించే పేదల గృహాల పునాదుల వరకు నామమాత్రపు రుసుముతో మట్టి అందించ లేకపోతే పేద కుటుంబాలు నష్టపోయే పరిస్థితి ఉంటుంది. కులమత రాజకీయ సామాజిక సమీకరణలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందిస్తూ మరోవైపు ఆడపడుచుల దీవెనలు అందేలా ప్రతి ఒక్క నాయకుడు పని చేయవలసి ఉంటుంది. గెలుపు ఓటమిలు దైవా దీనాలని వేచి ఉండకుండా ఎన్నికల కురుక్షేత్ర యుద్ధం దగ్గరకు వస్తున్న తరుణంలో ప్రజలలో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించే నాయకులే ఓటు బ్యాంకు సాధించే పరిస్థితి ఉంటుందన్నదే నగ్న సత్యం అని అనుకుంటున్నారు.

## నేడు మైలవరంలో జిల్లాస్థాయి కిసాన్ మేళా



**మైలవరం,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణంలో ఈ నెల 25వ తేదీ మంగళవారం జిల్లా స్థాయి కిసాన్ మేల నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కె.సంధ్యా రాణి సోమవారం తెలిపారు. పట్టణంలోని నూజివీడు రోడ్ ఎస్-ఎస్ కన్వెన్షన్ నందు ఫార్మర్ సైంటిస్ట్ ఇంటరాక్షన్ కిసాన్ మేళా జరుగను న్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి లో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు,జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారి సిహెచ్. తిరుమల దేవి,వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల జిల్లా హెడ్స్ పాల్గొంటారని వెల్లడించారు. ఈ కిసాన్ మేళా కార్యక్రమాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

## పారిశుద్ధ్య కార్మికుడు చమన్ గాంధీ మృతి

**● మట్టి ఖర్చులు నిమిత్తం నగదు సహాయం అందించిన టిడిపి మండల అధ్యక్షులు బండె శ్రీనివాసరావు**



**కోడూరు,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** కోడూరుగ్రామపంచాయతీలో దాదాపు 30 సంవత్సరాల పైగా పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న చమన్ గాంధీ అనారోగ్యంతో మృతి చెందాడు. గాంధీ మరణించాడు అని తెలుసుకున్న కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి బండె శ్రీనివాసరావు స్థానిక సంత మార్కెట్లోలో చమన్ గాంధీ మృతదేహానికి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం 3000 ఆర్థిక సహాయం అందించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కోడూరు పంచాయతీలో అందరూ కూడా గాంధీగా పిలుచుకుంటూ అందరికీ సుపరిచితుడుగా ఉన్నాడని , ఏ పని చెప్పిన చేసేవాడని బండె శ్రీనివాసరావు తెలిపారు . కోడూరు గ్రామపంచాయతీ కార్యదర్శి పరిమిశెట్టి నాగమల్లి కార్జునరావు తోపాటు కార్యాలయ సిబ్బంది చమన్ గాంధీ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గుంటూరు గిరి, బండె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాషా దినోత్సవం సందర్భంగా వక్తృత్వ పోటీలు



**హనుమాన్‌జంక్షన్,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్ మానవతా కార్యాలయంలో సోమవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. "తెలుగు భాష ప్రాముఖ్యత – – నేటి స్థితిగతులు, మెరుగుదలకు సూచనలు" అనే అంశంపై పోటీలు జరిగాయి. తెలుగు భాష ఔన్నత్యం, ప్రాధాన్యత, ప్రస్తుత పరిస్థితులు, భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పోటీదారులు తమ ప్రసంగాల ద్వారా వివరించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఇందిరాదేవి, రామచంద్రరావు, గణేష్ వ్యవహరించారు. విజేతలకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బహుమతులు అందజేయనున్నారు. ప్రథమ బహుమతిగా రూ.3,000, ద్వితీయ బహుమతిగా రూ.2,000, తృతీయ బహుమతిగా రూ.1,000తో పాటు గిఫ్ట్‌లను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## తేలికపాటి వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

**● పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులకు అడ్డుకట్ట ● మున్సిపల్ కమిషనర్ కే. మనోజ**



**తిరువూరు,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలో తేలికపాటి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కే. మనోజ సూచించారు. వర్షాల కారణంగా పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు, ప్రజలు తమ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు వృద్ధి చెందే అవకాశం ఉండటంతో అపరిశుభ్రతకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా పారిశుధ్య చర్యలకు ప్రజలు సహకరించాలని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.ముఖ్యంగా వర్షాకాలంలో తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని కమిషనర్ సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడివేడిగా వండిన ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. కలుషిత నీరు, నిల్వ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలి. వర్షాలు తేలికపాటిగానే ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. మున్సిపాలిటీ చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలి" అని కే. మనోజ కోరారు. తిరువూరు మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలను కొనసాగిస్తున్నట్లు మున్సిపల్ వర్గాలు తెలిపాయి.

## ప్రతిభకు దక్కిన గౌరవ పురస్కారం

**● సాయిరీ గోపాలరావును స్వర రత్న"బిరుదుతో సత్కరించిన జెబి ఫైన్ ఆర్ట్స్ అకాడమి**



**మైలవరం,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** మండలంలోని పుల్లూరు శివారు కొత్తగూడెం గ్రామానికి చెందిన సాయిరీ గోపాలరావుకు విదేశాలలో అరుదైన గౌరవ పురస్కారం దక్కింది.సంగీత కళాకారునిగా జీవనం సాగిస్తున్న గోపాలరావు థాయిలాండ్ దేశంలోని బ్యాంకాంగ్ లో శివ విహార దేవస్థానం లో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగు పాటలకు సంగీతం అందించి మన్ననలు పొందారు.గోపాలరావు 'ప్రతిభా పాటవాలు'ను జెబి ఫైన్ ఆర్ట్స్ అకాడమి వారు గుర్తించిన "స్వర రత్న"బిరుదుతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. విదేశాలలో తెలుగు సాంస్కృతి సాంప్రదాయాల ను చాటినందుకు గోపాలరావు ను పలువురు అభినందించారు.

## పెనుగంచిప్రోలు లో వర్షం - రైతుల్లో హర్షం..



**పెనుగంచిప్రోలు,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో సోవ-ువారం ఉదయం నుంచి వాతావరణం మారి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. రెండు రోజులు గా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజల కు వర్షం తో ఉపశమనం లభించింది. వర్షం కురుస్తుండటం తో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం పోలం పనులు ప్రారంభించేందుకు అనుకూలంగా ఉంటుందని రైతు లు అంటున్నారు.పంట కు కూడ ఈ వర్షం మేలుచేస్తుందని వారు ఆనందాన్ని వ్యక్త పరిచారు.

## బొబ్బిల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో రుద్రార్చన-సిందూరార్చన



**మచిలీపట్నం,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల పరంపరలో భాగంగా సోమవారం బొబ్బిల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో రుద్రార్చన--సిందూరార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రుద్రార్చన, సిందూరార్చనలో భక్తిపూర్వకంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 49 మంది మహిళలు పాల్గొనడం విశేషం. రుద్రార్చన ద్వారా శివతత్వాన్ని స్మరించుకోవడంతో పాటు సిందూరార్చన ద్వారా శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చారు. వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు కుటుంబ సౌఖ్యం సమాజ శాంతి దేశాభివృద్ధి మరియు సర్వలోక క్షేమం కోసం ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా కార్యాలయ ప్రముఖ్ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం ప్రసన్నాంజనేయులు సుభాషిణి దూళిపాల రాము ఆలయ పూజారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్ జిల్లా ప్రభారి పీవీఎస్ నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు ఆలయ పూజారులకు నిర్వాహకులకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా సమాజంలో భక్తి ఐక్యత, పరస్పర గౌరవం మరియు ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని వారు పేర్కొన్నారు. కుటుంబాలు ముఖ్యంగా మహిళలు ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా భవిష్యత్ తరాలకు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు మరియు ధార్మిక విలువలను అందించవచ్చని తెలిపారు. బొబ్బిల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన ఈ రుద్రార్చన--సిందూరార్చన కార్యక్రమం భక్తుల సమిష్టి భాగస్వామ్యంతో విజయవంతంగా ముగిసింది. భవిష్యత్తులో కూడా కృష్ణా జిల్లాలోని వివిధ ఆలయాల్లో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనసాగిస్తూ మరింత మంది భక్తులను ధార్మిక కార్యక్రమాలతో అనుసంధానించేందుకు కృషి చేస్తామని విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా నాయకత్వం తెలిపింది.

# మార్తాండ్ నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించండి.

-ఎమ్మెల్యే అరికపూడి గాంధికి వినతి పత్రం అందజేసిన స్థానికులు



**శేరిలింగంపల్లి,ఆగస్టు 24 (వార్తాప్రభ):**కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి,మౌలిక వసతులు మెరుగుపర్చాలని కోరుతూ కాలనీ వాసులు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వివేకానందనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.మంచినీటి సరఫరాను మెరుగుపర్చడంతో పాటు అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కోరారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.వరదనీటి కాల్వ పనులు పూర్తయిన వెంటనే మంచినీటి పైప్‌లైన్ పనులను పునరుద్ధరించి,మెరుగైన నీటి సరఫరా అందిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ ముదిరాజ్, శ్రీనివాస్ చౌదరి, తిరుపతి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులు నిర్ణీత గడువు లోగా పరిష్కరించండి కమిషనర్ ఆదేశం



**శేరిలింగంపల్లి,ఆగస్టు 24 (వార్తాప్రభ):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 47 వినతులు అందాయి.వీటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 38, ఇంజినీరింగ్ విభాగానికి 6, భూసేకరణ, పారిశుద్ధ్యం, పట్టణ జీవవైవిధ్య విభాగాలకు ఒక్కో వినతి చొప్పున ఉన్నాయి. ప్రతి వినతికి ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ కేటాయించి, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు పురోగతిని తెలుసుకునే అవకాశం కల్పించారు.ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.

# సిపిఎం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత



**హైదరాబాద్ ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ఎ ఐ. కె. ఎస్. ఉపాధ్యక్షులు, సిపిఎం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన వయస్సు 88 సంవత్సరాలు. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, కుమారులు వాసుదేవ రెడ్డి,మధు సూధన్ రెడ్డి, కుమార్తెలు, అనిత, సునీత ఉన్నారు. అనారోగ్య కారణంతో పెద్ద కుమార్తె అనిత ఇటీవలే మృతి చెందారు. వయోరిత్యా శ్వాసకోశ సమస్య రావటంతో ఆయన్ను కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి అక్కడే వైద్యులు వైద్య సేవలందిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఆరోగ్యం మరింత క్షీణించటంతో వైద్యులు అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. సోమవారం తెల్లవారుజామున 3.30గంటలకు మల్లారెడ్డి తుదిశ్వాస విడిచారు.మృతదేహాన్ని నిమ్స్ మార్చురీ లో భద్రపరిచారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్, కేవీపీస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బాబురావు తదితరులు మల్లారెడ్డి మృతదేహానికి నివాళు లర్పించారు.మల్లారెడ్డి మరణం పట్ల పలువురు నాయకులుతీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటనీ సంతాపం తెలిపారు.

# డెంగ్యూ, మలేరియా నివారణ కు దోమల అభివృద్ధిని నివారించాలి



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చూడటం, దోమల వృద్ధిని అరికట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని ప్రాజెక్ట్ మేనేజర్ షేక్ సుభాని అన్నారు. రామ్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్ డీఎఫ్ సీ పరివర్తన్ సహకారంతో వర్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డెంగ్యూ, మలేరియా దోమల నివారణపై ఇబ్రహీంపట్నం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ జాన్ సయ్యదా మాట్లాడుతూ జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. దోమ తెరలు ఉపయోగించడం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడటం వంటి జాగ్రత్తలను వివరించారు. వర్షాకాలంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ అశ్విని, ల్యాబ్ టెక్నీషియన్ రమ్య, ఫార్మాసిస్ట్ అన్నపూర్ణ, పైలట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# టెక్నాలజీ ఆధారిత ప్రొఫెషనల్ సేవలకు హబ్ హైదరాబాద్

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- హైదరాబాద్‌లో కావేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్‌ను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అంతర్జాతీయ న్యాయ నిపుణులను అందుబాటులోకి తీసుకురానున్న ఏఐ ఆధారిత కేంద్రం







**హైదరాబాద్ ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి):** అంతర్జాతీయ న్యాయ నైపుణ్యాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సేవలతో అనుసంధానిస్తూ ఏర్పాటు చేసిన కావేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్ హైదరాబాద్ కార్యాలయాన్ని సోమవారం నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ వృత్తిపరమైన రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోందని, దీనివల్ల అపారమైన అవకాశాలతో పాటు సాంకేతికతను బాధ్యతాయుతంగా, నైతికంగా, పారదర్శకంగా వినియోగించాల్సిన అవసరం కూడా ఏర్పడుతోందని అన్నారు.బలమైన టెక్నాలజీ వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అంతర్జాతీయ అనుసంధానం వంటి ప్రత్యేకతలు హైదరాబాద్‌కు ఉన్నాయని తెలిపారు. వీటి ఆధారంగా ఏఐ ఆధారిత ప్రొఫెషనల్, న్యాయ సేవలకు హైదరాబాద్‌ను కీలక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. తెలంగాణను అంతర్జాతీయ నిపుణులతో అనుసంధానించే ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రపంచస్థాయిలో మరింత గుర్తింపు తీసుకువస్తాయని పేర్కొన్నారు.కావేటి లా ఫర్మ్, న్యూయార్క్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ అటార్నీ, అలాగే కావేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాస్ రావు కావేటిని మంత్రి అభినందించారు. తెలంగాణకు చెందిన డాక్టర్ కావేటి 35 సంవత్సరాలకు పైగా అంతర్జాతీయ న్యాయ రంగంలో సేవలందిస్తూ భారత్, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, యూఏఈ తదితర దేశాల్లో సరిహద్దు దాటి జరిగే న్యాయ వ్యవహారాల్లో అనుభవం కలిగి ఉన్నారని తెలిపారు.హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కొత్త కేంద్రం ఇంటర్నేషనల్ లీగల్ యాక్సెస్ హబ్గా పనిచేయనుంది. దీని ద్వారా వ్యక్తులు, వ్యాపార సంస్థలు, ఎన్నారైలు, పెట్టుబడిదారులు వివిధ దేశాల్లో న్యాయ సేవలు అందించే న్యాయవాదులు, న్యాయ నిపుణులతో అనుసంధానం కావచ్చు. అంతర్జాతీయ న్యాయ నిపుణులు హైదరాబాద్‌కు వచ్చి క్లయింట్లతో సంప్రదింపులు, వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించే అవకాశాన్ని కూడా ఈ కేంద్రం కల్పించనుంది.అమెరికాలో ఇమ్మిగ్రేషన్, కుటుంబ న్యాయం, సివిల్ లిటిగేషన్, అంతర్జాతీయ విడాకులు, కార్పొరేట్, క్రిమినల్ లా తదితర సేవలు; బ్రిటన్‌లో ఇమ్మిగ్రేషన్, కుటుంబ న్యాయం, సివిల్ లిటిగేషన్ సేవలను ఫర్మ్ అందించనుంది. యూఏఈలో వర్కర్స్ కాంపెన్సేషన్, ఉద్యోగ సంబంధిత అంశాలు, ఒప్పంద వివాదాలకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉంటాయి. భారత్‌లో కంపెనీ, ట్రేడ్‌మార్క్ చట్టాలు, సివిల్, క్రిమినల్, కార్మిక చట్టాలు, రిట్ పిటిషన్లు, రుణ వసూలు, వినియోగదారుల వ్యవహారాలు, స్పెషల్ లీవ్ పిటిషన్లు, రియల్ ఎస్టేట్ తదితర అంశాల్లో న్యాయ సేవలు అందించనున్నట్లు సంస్థ తెలిపింది.హైదరాబాద్ కేంద్రంలో న్యాయ సేవల్లో ఏఐను బాధ్యతాయుతంగా వినియోగించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. న్యాయ పరిశోధన, సమాచార సేకరణ, పత్రాల విశ్లేషణ, డిస్కవరీ, క్లిష్టమైన అంతర్జాతీయ కేసుల ప్రాథమిక మ్యాపింగ్ వంటి పనుల్లో ఏఐను సహాయక సాధనంగా వినియోగించనున్నారు.అయితే ఏఐను న్యాయవాదులకు ప్రత్యామ్నాయంగా కాకుండా సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగిస్తామని సంస్థ స్పష్టం చేసింది. న్యాయ సలహాలు, ప్రాతినిధ్యం వంటి సేవలను సంబంధిత చట్టాలు, వృత్తిపరమైన నైతిక ప్రమాణాలకు అనుగుణంగా అర్హత కలిగిన న్యాయ నిపుణులే అందిస్తారని పేర్కొంది.సాంకేతికత ద్వారా సేవలకు ఉన్న అడ్డంకులను తగ్గించి, సామర్థ్యాన్ని పెంచి, ప్రత్యేక నైపుణ్యం కలిగిన సేవలను మరింత విస్తృత వర్గాలకు అందుబాటులోకి తీసుకురావాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని టెక్నాలజీ సామర్థ్యాలను అంతర్జాతీయ ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌లతో అనుసంధానించే ఇలాంటి కార్యక్రమాలు తెలంగాణను ఆవిష్కరణలు, జ్ఞానాధారిత సేవలకు అంతర్జాతీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో దోహదపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# మున్నూరు కాపు అన్నదాన సత్రంలో అదనపు గదుల ప్రారంభోత్సవం

- సత్రం డైరెక్టర్‌గా కుంట సిద్ధిరాములు నియామకం.. శాలువాతో సత్కరించి నియామక పత్రం అందజేత
- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గది నిర్మాణానికి విరాళం అందించిన కుంట కుటుంబీకులు





**వేములవాడ, ఆగస్టు 24, (వార్తాప్రభ)** : వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ సమీపంలోని రాజరాజేశ్వరీ మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్రంలో నూతనంగా నిర్మించిన అదనపు గదుల ప్రారంభోత్సవం ఆదివారం ఉదయం వైభవంగా జరిగింది. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ అదనపు గదుల నిర్మాణానికి కుంట కుటుంబీకులు ఉదారంగా విరాళం అందజేశారు. సమాజ సేవలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కుంట సిద్ధిరాములు సేవలను గుర్తించి ఆయనను రాజరాజేశ్వరీ మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్రం ట్రస్ట్ డైరెక్టర్‌గా నియమించారు. సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన సత్రం అధ్యక్షుడు కొండ దేవయ్యకు కుంట సిద్ధిరాములు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కుంట సిద్ధిరాములు, పద్మ దంపతులు, కుంట పోచయ్య, సుగుణమ్మ దంపతులు మరియు కుంట ఈశ్వరయ్య, నాగరాణి దంపతులు తమ తల్లిదండ్రుల స్మృత్యర్థం ఒక నూతన గది (రూమ్) నిర్మాణానికి అయ్యే నిధులతో పాటు పూజా సామగ్రిని అన్నదాన సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్యకు అందజేశారు. కుంట కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో చేపట్టిన ఈ గది నిర్మాణం పూర్తికావడంతో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గదులను ప్రారంభించారు. రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు, మున్నూరు కాపు అన్నదాన సత్రంలో మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు ఈ అదనపు గదులు ఎంతగానో ఉపయోగపడతాయని సత్రం ప్రతినిధులు తెలిపారు. సమాజ సేవా దృక్పథంతో విరాళం అందించిన కుంట కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు.

# కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ భూముల వేలం ఆపకపోతే ఉద్యమం

-పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్.

భూముల అమ్మకాలపై కాంగ్రెస్ దృష్టి - వడ్డేపల్లి రాజేశ్వర రావు





**కూకట్ పల్లి,ఆగస్ట్ 24(వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 22ఏ నిషేధిత భూ జాబితా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షల కోట్ల రూపాయలు వసూలు చేయడంతో పాటు దానిలో 30 శాతం కమిషన్లు వీరు తీసుకునేలా ఈ వ్యవహారం ఉందని తీవ్రస్థాయిలో మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూములు అమ్మకాల విషయంలో దృష్టి పెట్టడమే తప్ప మౌలిక వస్తువులు కల్పించడంలో విఫలమైందని వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు.వచ్చే నెలలో కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ భూముల వేలం విషయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి వేలం వేసే స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవాళ్ల సొంతింటి కల నెరవేర్చేందుకు హౌసింగ్ బోర్డు ను ఏర్పాటు చేస్తే ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు ఉపయోగపడేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎల్ఐజి,ఎంఐజి, హెచ్ఐజి, ఈడబ్ల్యూఎస్ పేరిట భూములను విక్రయించేందుకు డోర్లు తెరిస్తే రేవంత్ రెడ్డి మొత్తాన్ని గాలికి వదిలేసారని అన్నారు. ఎక్కడ చూసిన చిన్న స్థలంలో నాలుగు నుండి ఆరంతస్తులు నిర్మాణం చేస్తున్నారని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. హౌసింగ్ బోర్డ్ స్థలాలను అమ్మకుండా ఇక్కడ ఉండే నివాసితులకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్, స్కూల్లో నిర్మాణం, ఆట స్థలాలు, పార్కులు, అంగన్వాడి కేంద్రాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. శివారు ప్రాంతాలలో భూములు అమ్మితే 200 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ప్రభుత్వం చెప్తున్నా నేపథ్యంలో శివారు భూములు అమ్ముకొని ప్రస్తుత ఉన్న భూములను మౌలిక సదుపాయాలకు ఉపయోగించాలన్నారు. రెండో తేదీన జరగనున్న వేలాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ లబ్ధిదారులు ఉంటే అక్కడే నిర్మాణాలు చేపట్టాలని శివారు ప్రాంతాలలో ఇచ్చి వారి పొట్టను పొట్ట వద్దని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా తాము చెబుతున్నా కూడా ప్రభుత్వం భూముల అమ్మకాల విషయంలో మొండి వైఖరి వీడడం లేదని విమర్శించారు.

# బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా బండారి రవి



**మల్కాజిగిరి :ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అర్బన్ బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులుగా గౌతమ్ నగర్ డివిజన్ మల్లికార్జున గారికి చెందిన బండారి రవి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కటికల సుధాకర్ నియామక ఉత్తర్వులను జారీ చేసినట్లు సోమవారం మల్లికార్జున నగర్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో బండారి రవి తెలిపారు. ఈ సందర్భంగా బండారి రవి మాట్లాడుతూ పదవి వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. రానున్న రోజులలో మేడ్చల్ జిల్లా లో బిజెపి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి కృషిచేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్, ఇతర పార్టీ పెద్దలకు బండారి రవి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు సంబంధించిన 15 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి :బి.జె.పి.





**శేరిలింగంపల్లి,ఆగస్టు 24 (వార్తాప్రభ):**రాష్ట్రంలోని విద్యార్థుల కు సంబంధించిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రా ంచం దర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు మద్దతుగా శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ నాయకులు, విద్యార్థులు సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలివెళ్లారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేపట్టిన దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అజిత్ కుమార్ సేనాపతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్ రెడ్డి, హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కైతాపురం జితేందర్,చందానగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ నాయకులు రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ స్టేట్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి జేటి రాజేంద్రప్రసాద్ ఎన్నిక



**విస్సన్నపేట ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏపీ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జేటి రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. 22, 23 తేదీలలో ఏలూరులో జరిగిన ఎన్నికలలో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట యూనిట్ నుండి ఆయన ఎన్నిక కావడంతో విస్సన్నపేట పరిసర ప్రాంత మండలాల నుండి పలువురు అభినందనలు తెలియజేశారు.

# డిఎస్సీ పై సిబిఐ విచారణ జరిపించాలి



**రెడ్డిగూడెం ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)):**కూటమి ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో డిఎస్సీ లో జరిగిన అక్రమాల పై సిబిఐ తో విచారణ జరిపి, అర్హులైన వారికి న్యాయం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి, రెడ్డిగూడెం వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీని అబద్ధాలతో తప్పుదారి పట్టించి తన కొడుకును రక్షించుకునే పనిలో ఉన్నారని ఆరోపించారు. వాస్తవాలు మాట్లాడుతున్న వారిపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపుతూ రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నారని అన్నారు. డిఎస్సీ పరీక్ష రాయకుండా ఉద్యోగం ఇచ్చిన వారిని పి వి సింధూ తో పోల్చడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. డిఎస్సీ పరీక్షకు హాజరవకుండానే, స్పోర్ట్స్ విభాగంలో శిక్షణ కూడా లేకుండా 372 మందికి ఎలా ఉద్యోగం ఇస్తారని ప్రశ్నించారు. డిఎస్సీ లో అక్రమాలు జరగకపోతే ఈ వ్యవహారం సిబిఐ కి ఎందుకు అప్పగించరని ప్రశ్నించారు. డిఎస్సీ లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## కేంద్రంతో పాటు . ..
## 22 రాష్ట్రాలకు జమిలి ఎన్నికలు ?

దేశంలో జమిలి ఎన్నికలకు రంగం సిద్ధం అవుతోంది. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ 2019లో ఆ ముచ్చట తీర్చుకోవాలని అనుకుంది. కానీ అపుడు కుదరలేదు, 2024లో అవుతుంది అనుకుంటే అది కూడా అసలు కాలేదు, అయితే 2024 ఎన్నికల కంటే ముందు మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ సారధ్యంలో జమిలి ఎన్నికల మీద ఒక కమిటీని కేంద్రం వేయగలిగింది ఆ కమిటీ ఇచ్చిన నివేదికను పార్లమెంట్ జేపీసీ ముందు ఉంచింది. ఆ సిఫార్సులు వచ్చిన తర్వాత 2029 లో జమిలి ఎన్నికలతో వెళ్లాలన్నది కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం టార్గెట్ గా ఉంది అని అంటున్నారు. దేశంలో 1952 తొలిసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అపుడు కేంద్రంతో పాటు జమిలిగానే సాగాయి. అదే తీరున 1957, 1962లలో కూడా జరిగాయి. అయితే 1967 లోనే గాడి తప్పింది. అప్పటికి ప్రాంతీయ పార్టీలు రావడం కొత్త పార్టీల ఏర్పాటుతో కాంగ్రెస్ ఏకపక్ష రాజకీయాలకు గండి పడింది. ఆ మీదట నుంచి చూస్తే దేశంలో జమిలి ఎన్నికలు కాదు విడిగానే జరుగుతున్నాయి. సుమారు ఆరు దశాబ్దాలుగా ఇదే రకమైన ధోరణితో సాగుతోంది. దీని వల్ల ప్రతీ సారీ ఎక్కడో ఒక చోట ఎన్నికలు సాగుతున్నాయి. దాని వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని అలాగే ఎంతో పెద్ద మొత్తంలో ఎన్నికల ఖర్చు అవుతోందని కేంద్రంలోని బీజేపీ భావిస్తోంది. అందుకే జమిలి ఎన్నికలు అంటోంది. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా ఒకేసారి ఎన్నికలు జరిపించాలన్నది కేంద్రం ఆలోచన. ఆ దిశగా భారీ కసరత్తు అయితే సాగుతోంది. మూడొంతుల రాష్ట్రాలతో కలసి : ఇదిలా ఉంటే జమిలి ఎన్నికలకు కాంగ్రెస్ దాని మిత్రుల నుంచి అడ్డంకి వస్తోంది. అందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరో ఆలోచన చేస్తోంది. బీజేపీకి దేశంలో సొంతంగా 15 రాష్ట్రాలకు పైగా అధికారం ఉంది. మిత్రులతో కలుపుకుని మరో ఏడు చోట్ల అధికారం అందుకుంటోంది. ఈ లెక్కన 22 రాష్ట్రాలలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉన్నాయి. దాంతో తమ రాష్ట్రాలలో జమిలి ఎన్నికల కోసం అప్పటికే ఉన్న ప్రభుత్వాల పాలనను వెనక్కి కానీ ముందుకు కానీ జరుపుకునేందుకు పెద్దగా అభ్యంతరాలు ఉండవని బీజేపీ భావిస్తోంది. దాంతో పాటుగా వీలైతే కాంగ్రెస్ ఇతర పక్షాలతో సంప్రదించాలని కూడా చూస్తోంది అని అంటున్నారు. ఈ మేరకు జమిలి ఎన్నికల మీద ఏర్పాటు అయిన పార్లమెంటరీ జాయింట్ యాక్షన్ కమిటీ వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర రాజకీయ పార్టీ అధినేతలతో చర్చలు జరుపుతోంది అని తెలుస్తోంది: ఇక దేశంలో 22 ఎన్డీయే రాష్ట్రాలలో ఆంధ్ర ప్రదేశ్, సిక్కిం, అరుణాచల ప్రదేశ్, ఒడిషాలలో చాలా కాలంగా లోక్ సభ ఎన్నికలతో పాటే అసెంబ్లీల ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక ఈ జమిలి చట్రంలోకి 18 రాష్ట్రాలను చేర్చాల్సి ఉంది. ఒక జమిలి ఎన్నికలను 2029 లోక్ సభ ఎన్నికలలో అమలు చేయాలనుకుంటే కనుక గోవా, గుజరాత్, మణిపూర్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలం గట్టిగా రెండేళ్ళకే ముగుస్తుంది. ఎందుకంటే 2027 లో ఇక్కడ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వాలు ఏర్పడతాయి. అలాగే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల అసెంబ్లీల గడువు అయితే నాలుగేళ్ళు తగ్గించాల్సి వస్తుంది. ఇక్కడ 2028లో ఎన్నికలు ఉన్నాయి. అంటే ఎన్నికైన ఏడాదికే మరోసారి జమిలి పేరుతో ఉన్న అసెంబ్లీలను రద్దు చేసుకుని ఎన్నికలకు సిద్ధపడాలి అన్న మాట. ఇక జమిలి చట్రంలోకి వస్తే బీహార్ అసెంబ్లీ కాలం నాలుగేళ్ళకే ముగుస్తుంది. మహారాష్ట్ర అసెంబ్లీ గడువు ఆరు నెలల ముందే ముగుస్తుంది. పశ్చిమ బెంగాల్, అస్సాం వంటి రాష్ట్రాలు మూడేళ్ళకే అసెంబ్లీ రద్దు చేసుకుని జమిలికి రావాల్సి ఉంటుంది. ఢిల్లీ నాలుగేళ్ళకే అసెంబ్లీ రద్దు చేసుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే 2029 నాటికి జమిలి ఎన్నికలు సాధ్యమే అంటూ జమిలి ఎన్నికల మీద నియమించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పీపీ చౌదరి సంకేతాలు ఇస్తున్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి వన్ నేషన్ వన్ ఎలక్షన్ అన్న కసరత్తుని పూర్తి చేసేందుకు తమ కమిటీ కృషి చేస్తోంది అని ఆయన చెప్పారు.

## డ్రోన్ సాయంతో కొండప్రాంతాల్లో విత్తనాలు వెద జల్లుట





**విజయవాడ పశ్చిమ ఆగష్టు 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** మొక్కలు పెంపకం లక్ష్యంగా అటవీ శాఖ అధికారులు కొండప్రాంతాల్లో విత్తనాలు బంతులు వెదజల్లారు. ఎన్ టి ఆర్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ సతీష్ ఆదేశానుసారం డ్రోన్లతో విత్తన ఎంతులుఅటవీ భూముల్లో పచ్చదనం పెంపు కోసం విజయవాడ సెక్షన్లో నికొత్తూరు తాడేపల్లి ఆర్ ఎఫ్ , అడవి నెక్కలం ఆర్ ఎఫ్ ఏరియాలలోని కొండలపైడ్రోన్ల సాయంతో విత్తన బంతులు వెదజల్లుతున్నారు. వర్షాలుప్రారంభమైన, ఇవి మొలకెత్తుతాయన... తద్వార అడవుల్లో మొక్కల సాంద్రత పెరిగి పర్యావరణానికి మేలు కలుగుతుందనవివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రేంజ్ అధికారికె. శ్రీనివాసులరెడ్డి, డిప్యూటి రేంజ్ అధికారి పి. పోతురాలుఎఫ్ ఓ కె. జయశంకరరాయి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ముచ్చింతాల లో మౌలిక సమస్యల పై పిజిఆర్ఎస్ లో పిర్యాదు...



**పెనుగంచిప్రోలు - ఆగస్టు 24( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం లో ని ముచ్చింతాల గ్రామం లో మౌలిక వసతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పి జి ఆర్ ఎస్ లో పిర్యాదు చేశారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజి, పారిశుధ్యం విధి దీపాలు, వంటి సమస్యలకు శాశ్వాత పరిస్కారం చూపాలని గ్రామానికి చెందిన గోపి కోరారు. పండల పరిషత్ కార్యాలయం లో సోమవారం ఎంపిడిఓ శ్రీమతి జి. శ్రీను ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కర వేదిక లో పిర్యాదు అందజేశారు..

# 90 ఏళ్ల వస్త్రాలత ప్రస్థానం స్ఫూర్తిదాయకం

### పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న







**విజయవాడ పశ్చిమ ఆగష్టు 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడలోని మినర్వా గ్రాండ్లో నిర్వహించిన వస్త్రాలత 90వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న గారు ముఖ్య అతిథిగా హాజరైయ్యా రు .ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న గారు మాట్లాడుతూ వస్త్రాలత నేటితో 90 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఒకప్పుడు విజయవాడను చిన్న బొంబాయి గా పిలిచే స్థాయిలో వ్యాపార రంగం అభివృద్ధి చెందడానికి వస్త్రాలత వంటి సంస్థలు, వ్యాపారుల కృషి ఎంతో ఉందన్నారు.వస్త్రాలత కేవలం వ్యాపార కార్యకలాపాలకే పరిమితం కాకుండా, కులమతాలకు అతీతంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ అనేక కుటుంబాలకు అండగా నిలిచిందని బుద్ధా వెంకన్న కొనియాడారు. ఎన్నో దశాబ్దాలుగా వ్యాపారులు, కార్మికులు, ఉద్యోగులు, వినియోగదారులతో అనుబంధాన్ని కొనసాగిస్తూ వస్త్రాలత తన ప్రత్యేకతను నిలబెట్టుకుందని అన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యాపార రంగంలో కూడా అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ముఖ్యంగా ఆన్లైన్ వ్యాపారం విస్తరించడం వస్త్రలత వ్యాపారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. వస్త్రాలత వ్యాపార రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తరపున ఏదో ఒక విధంగా సహాయం అందించేలా తన వంతు కృషి చేస్తానని బుద్ధా వెంకన్న హామీ ఇచ్చారు. వ్యాపారుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.విజయవాడ వస్త్రాలత వ్యాపార రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తే నగరంలో ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని, స్థానిక వ్యాపారులు బలోపేతం అయితే వేలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. 90 ఏళ్ల ఘన చరిత్రను కొనసాగిస్తూ వస్త్రాలత భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని, విజయవాడ వ్యాపార రంగంలో తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని బుద్ధా వెంకన్న ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వస్త్రలత అసోసియేషన్ అధ్యక్షులు ఓలేటి జగన్మోహన్,అసోసియేషన్భాధ్యులు ఎస్ శివ, కొత్త ఆనంద్ పొన్నూరు రామ్ కుమార్ , మద్ది సుబ్బారావు గొల్ల రామచంద్ర, వివికె నరసింహరావు, మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరావు,తదితరులు పాల్గొన్నారు.

# సంగీత సాహిత్యాలతో అలరించిన 'సృజనోత్సవం'

**● రోజంతా సాహిత్య సాంస్కృతిక సందడి ● మహాత్మాగాంధీ రోడ్- ఠాగూర్ గ్రంథాలయ ఆడిటోరియం వేదిక ● రెండు తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన కవులు, కళాకారులు ● శతాధిక కవుల ఆత్మీయ సంగమం ● తెలుగుభాష, పర్యావరణం, సంస్కృతి సంప్రదాయాలపై గళ మెత్తిన కవులు ● సాహిత్యానికి తోడుగా రాగాలాలపించిన గాయకులు ● కూచిపూడి నృత్యంతో అలరించిన చిన్నారులు ● మల్లెతీగ-గిడుగు సేవా పురస్కారాలందుకున్న సాహిత్య, సాంస్కృతిక సేవాసారధులు ● శతాధిక కవులకు శాలువా, జ్ఞాపికతో కవి సత్కారం ● ప్రముఖ రచయితల మూడు పుస్తకాలు ఆవిష్కరణ**








**విజయవాడ పశ్చిమ ఆగష్టు 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** సృజనోత్సవం వంటి వినూత్న కార్యక్రమాలు సాహిత్య సాంస్కృతిక రంగాన్ని మరింత సజీవం చేస్తాయని పలువురు వక్తలు కొనియాడారు. సాహిత్య సాంస్కృతిక సారధులను ప్రోత్సహిస్తూ, భాష సంస్కృతుల ను మరింత మెరుగు పరచే దిశగా మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆదివారం విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో 'సృజనోత్సవం' కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని గిడుగు రామమూర్తి పంతులు మునిమనవడు గిడుగు వెంకట నాగేశ్వరరావు అతిథిగా హాజరై జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. సభాధ్యక్షులుగా సుప్రసిద్ధ మానసిక వైద్య నిపుణులు డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ– సాహితీమూర్తుల్ని, కళాకారుల్ని ప్రభుత్వం గుర్తిస్తున్నప్పటికీ అందరినీ గుర్తించడం సాధ్యం కాదు కాబట్టి సామాజిక బాధ్యతతో మల్లెతీగ వంటి సంస్థలు ముందుకొచ్చి గిడుగు వారి పేరుతో పురస్కారాలివ్వడం అభినందించాల్సిన విషయమన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ– నేటి యువతలో పుస్తక పఠనం, కవిత్వం, సంగీతం, సాంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచాల్సిన అవసరం వుందని, ఆ దిశగా సృజనోత్సవం వంటి సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ఆంధ్ర నాటక కళాసమితి వ్యవస్థాపకులు నన్నపనేని నాగేశ్వరరావు, సుప్రసిద్ధ రచయిత డా. యం. ప్రభాకర్, సుప్రసిద్ధ కవి, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ సలహాదారులు చిన్ని నారాయణరావు, ఠాగూర్ గ్రంథాలయ గ్రేడ్ 1 గ్రంథ పాలకురాలు శ్రీమతి కె. రమాదేవి సీనియర్ జర్నలిస్టు ఘంటా విజయ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. పైనేని తులసీనాధం నాయుడు(చిత్తూరు జిల్లా), షేక్ కరీముల్లా (పల్నాడు జిల్లా), డా. తూములూరి రాజేంద్రప్రసాద్ (గుంటూరుజిల్లా), విల్సన్ రావు కొమ్మవరపు (ఎన్టీఆర్ జిల్లా), రేపాక రఘునందన్ (ఎన్టీఆర్ జిల్లా), జ్యోతి మువ్వల (విశాఖపట్నం), శ్రీమతి ఎం. వరలక్ష్మీ కళ్యాణి (గుంటూరు జిల్లా), డా. వి. రఘుపతి (చిత్తూరు జిల్లా), డా. టి. పార్ధసారధి (ఏలూరు జిల్లా), వసుధ బసవేశ్వరరావు (కృష్ణాజిల్లా)లకు మల్లెతీగ –గిడుగు పురస్కారాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 130 మంది కవులు తెలుగుభాష, పర్యావరణం, సంస్కృతి సంప్రదాయాలపై కవితా పఠనం చేశారు. కార్యక్రమ ప్రారంభంలో 'కళాక్షేత్ర ది డాన్స్ అకాడమీ' నిర్వాహకులు ఎ. గీత, పి. మౌనిక శిష్యబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు, గాయకులు పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. 'అంతరంగ వీక్షణం', 'నిడదవోలు చరిత్ర', 'విశ్వకవి సమ్రాట్' మూడు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. వ్యాఖ్యాతగా శ్రీమతి వంగిపురపు శారద వ్యవహరించగా సభను మల్లెతీగ వ్యవస్థాపకుడు కలిమిశ్రీ పర్యవేక్షించారు.

# ప్రత్యామ్నాయం చూపే దాకా రాజీవ్ గాంధీ హోల్ సేల్ వెజిటేబుల్ మార్కెట్ ను కొనసాగించాలి

### అధికారులకు రాజీవ్ గాంధీ హోల్ సేల్ వెజిటేబుల్ మార్కెట్ అసోసియేషన్ నాయకుల వినతి




**విజయవాడ పశ్చిమ ఆగస్టు 24:(వార్త ప్రభ ప్రతినిధి)** ప్రత్యామ్నాయంగా వసతి చూపేదాక రాజీవ్ గాంధీ హోల్ సేల్ వెజిటబుల్ మార్కెట్ ను అక్కడే ఉన్న ప్రాంతంలో కొనసాగించాలని, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కు, విజయవాడ నగరపాలక సంస్థ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు రాజీవ్ గాంధీ హోల్సేల్ వెజిటబుల్ మార్కెట్ అసోసియేషన్(స్థాపితం 1983) నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వన్ టౌన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు అల్లు మురళీకృష్ణ, కార్యదర్శి వెన్నం రత్నారావు, కోశాధికారి పైడి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. విజయవాడ నగరపాలక సంస్థ సమీపంలోని రాజీవ్ గాంధీ హోల్ సేల్ మార్కెట్ ను రైల్వే శాఖ అధికారులు ఏకపక్షంగా తొలగించడం జరిగిందని, అక్కడ ఉన్న 17 షాపుల వారికి ప్రత్యామ్నయం చూపిన తర్వాతే తరలిస్తామని చెప్పినా హఠాత్తుగా తమ షాపులను రైల్వే అధికారులు పడగొట్టడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అసోసియేషన్ కు సంబంధం లేని కొంతమంది హోల్ సేల్ కూరగాయల వ్యాపారులు కృష్ణాజిల్లా పరిధిలోని నున్న ప్రాంతంలో వేరే అసోసియేషన్ పేరుతో మార్కెట్ ను ఏర్పాటు చేసుకొని, రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ మొత్తం అక్కడికి తరలిపోయినట్లు దురుద్దేశంతో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బాగా డబ్బున్న వ్యాపారులు కొంతమంది డబ్బున్న బయట వ్యక్తులను కలుపుకొని నున్న ప్రాంతంలో సొంతంగా పెట్టుబడి దారి విధానంలో మార్కెట్ ను ఏర్పాటు చేసుకున్నారన్నారు. నున్న ప్రాంతంలో ఏర్పాటు చేసినట్లు చెబుతున్న మార్కెట్లో సామాన్య హోల్ సేల్ వ్యాపారులకు స్థానం లేకుండా పోయిందని, ఒక్కో షాప్ నకు 70, 80 లక్షల రూపాయల చెల్లించాల్సి రావడం తమ వంటి సామాన్య వ్యాపారులకు సాధ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ నగరంలోని మార్కెట్ నుంచి నున్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన మార్కెట్ 16 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఇది సామాన్య వ్యాపారులకు అందుబాటులో లేకుండా పోయిందని వారు వివరించారు. విజయవాడ నగరానికి గుండెకాయ వంటి రాజీవ్ గాంధీ హోల్ సేల్ మార్కెట్ విజయవాడ నగర ప్రజలకు, అలాగే ఎన్టీఆర్ జిల్లా వాసులకు అందుబాటులో ఉంటుందని వారు వివరించారు. ప్రస్తుతం విజయవాడ నగరానికి హోల్సేల్ కూరగాయలు మార్కెట్ లేకుండా పోయే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. నున్న ప్రాంతం మార్కెట్ కృష్ణాజిల్లా పరిధిలో ఉందని పేర్కొన్నారు. నున్న ప్రాంతంలో మార్కెట్ ఏర్పాటు చేసుకున్న వ్యాపారుల్లో అనేకులు కార్పొరేషన్ కి లక్షలాది రూపాయలు అద్దెలను చెల్లించకుండానే వెళ్లిపోవడం జరిగిందన్నారు. దశాబ్దాల తరబడి నగరపాల సంస్థ ప్రక్కనే ఉన్న స్థలంలో వ్యాపారాలు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలనీ ప్రజా ప్రతినిధులకు, అధికార యంత్రాంగానికి వారు విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి నగరపాలక సంస్థకు, ప్రభుత్వానికి అద్దెలు,పన్నులు చెల్లిస్తున్న తమకు న్యాయం చేయాలని వారు కోరారు. తమ 17 మంది వ్యాపారులకు సంబంధించి విజయవాడ నగరపాలక సంస్థ వారు ఆర్ సి ఎన్1- 120621/2023 ద్వారా ఇచ్చిన ఎండార్స్మెంట్ ప్రకారం అధికారులు 17 మంది వ్యాపారులకు కేటాయిస్తామని ప్రతిపాదించిన విద్యాధరపురం ఆర్ఎస్ నెంబర్ 132/బి వద్ద ప్రతిపాదించిన 1915.17 చదరపు గజాల ప్రత్యామ్నాయ స్థలాన్ని వెంటనే అభివృద్ధి చేసి తమకు కేటాయించాలని వారు కోరారు. అప్పటివరకు తమను ప్రస్తుతం ఉన్న రాజీవ్ గాంధీ హోల్సేల్ మార్కెట్ ప్రాంతంలోనే వ్యాపారాలు చేసుకొనివ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి పప్పుల శేషు, సంఘం నాయకులు ఆలమూరి పవన్, రౌతు తారక్, దాడి అరుణ్, జి. రమేష్, సుంకర శివాజీ, వెన్నం వెంకట రామ కృష్ణ తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ధర్మ రక్షణ కోసం ధర్మ రక్షాబంధన్

### బాపట్ల జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ:



**చెరుకుపల్లి మండలం ఆగష్టు 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి ని పురస్కరించుకొని ఈనెల 23వ తేదీ నుండి సెప్టెంబర్ 6 తేదీ వరకు సంవేదిత శీల గ్రామాలలో ఏరియాలలో ధర్మ రక్షా బంధం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సత్యనారాయణ తెలియజేశారు. చెరుకుపల్లి అరుంబాక ఎస్టీ కాలనీ గుళ్ళపల్లి టీ కాలనీ లలో ధర్మరక్ష కంకణ ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనిద్దరం దేశానికి ధర్మానికి రక్ష అంటూ ధర్మరక్షణ కంకణాలు ధరించారు. వీరు మాట్లాడుతూ హిందువులందరూ ధర్మరక్షణ కోసం ధర్మ రక్షా కంకణం ధరించి ధర్మరక్షణకు కృషి చేయాలి అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు ఖండ్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ మాతాజీ జయంపు కమల తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నియంత్రణ కోసం భవానీపురం పోలీసుల ఛాలెంజ్..

### సమాచారం ఇస్తే నగదు బహుమతి..
### గంజాయి అమ్మకాలపై సమాచారానికి నగదు బహుమతి
### విజయవాడ వెస్ట్ జోన్ ఎసిపి దుర్గారావు




**విజయవాడ పశ్చిమ ఆగష్టు 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ సిటీ గంజాయి పూర్తిస్థాయి నిర్మూలనే లక్ష్యంగా భవానీపురం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారని పశ్చిమ మండలం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) ఎన్.ఎస్.వి.కె. దుర్గారావు తెలిపారు. ఆదివారం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సేవించే వారి సమాచారం అందించిన వారికి రూ. 1,500, విక్రయించే వారి వివరాలు తెలిపిన వారికి రూ. 5,000 నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. సమాచారం అందించిన వారి వివరాలను సంపూర్ణంగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. భవానీపురం స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు 1,210 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా, ప్రారంభంలో 119 మందికి పాజిటివ్ వచ్చిందని, పోలీసుల అవగాహన కార్యక్రమాల వల్ల మూడు నెలల తర్వాత జరిపిన పునఃపరీక్షల్లో ఆ సంఖ్య 19కి పడిపోయిందని వెల్లడించారు. గంజాయి రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించి సమాచారం ఉన్నవారు 112 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవానీపురం సిఐ కె. ఉమామహేశ్వరరావు, ఎస్‌ఐలు బి. రవితేజ, కె. కిరణ్, జి. ప్రదీప్, ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గొడవ గంజాయి, బ్లేడు బ్యాచ్చి లకు ముడిపెట్టొద్దు

### సీపీ నేతృత్వంలో నాగరాన్ని డ్రగ్స్ రహితంగా మారుస్తున్నాం ..గంజాయి అమ్మకాల, గంజాయ్ సేవనాల సమాచారం అందిస్తే నజరానా
### కొత్తపేట సి ఐ కొండలరావు




**విజయవాడ పశ్చిమ ఆగష్టు 24 :(వార్త ప్రభ ప్రతినిధి )**విజయవాడ నగరంలో, కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగే ప్రతి గొడవకు గంజాయి, బ్లేడు బ్యాచ్చి గొడవే అంటూ ముడి పెట్టొద్దని పరిస్థితి నిచితంగా గమనించాలని కొత్తపేట పోలీస్ స్టేషన్ సి ఐ కొండలరావు విజ్ఞప్తి చేశారు. సి పి నెత్రుత్వంలో డ్రగ్స్ నియంత్రణ జరుగుతుందని అందుకే "ఈగల్ చాలెంజ్ " గా చె బుతున్నాం గంజాయి అమ్మిన లేదా అమ్ముతున్నా అలాంటి వారి సమాచారం అందిస్తే వారికి రూ 5000, నజరానా అందిస్తామని అలాగే తాగుతున్న వారిని పట్టిస్తే రూ 1500 నజరానా అందిస్తున్నట్టు సోమవారం ఉదయం కొత్తపేట పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సి ఐ వెల్లడించారు. సమాచారం అందించిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని అయన తెలిపారు.రాజధాని అమరావతి పరిధిలో వున్న విజయవాడ నాగరాన్న భ్రష్టు పట్టించకుండా పోలీసుల ప్రయత్నాలు ఫలించడానికి డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించగలరని సి ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం లో సి ఐ తో పాటుగా ఎస్ ఐ ఉమా మహేశ్వరరావు, మహిళా ఎస్ ఐ కే కరుణ తదితరులు పాల్గొన్నారు.

# పసి పిల్లలు మల్లెలు

వెన్నెల్లా నవ్వులు
సన్నజాజి పువ్వులు
చిన్నారులో మహిలో
కాంతులీను దివ్వెలు
వెన్నలాంటి మనసులు
మిన్న వారి గుణములు
అల్లరిలో ప్రథములు
అందరికీ ఇష్టులు
రూపంలో అందము
పరిమళించు గంధము
ముద్దులొలుకు పిల్లలు
మనసుదోచు మల్లెలు
పిల్లలున్న గృహములు
చూడ స్వర్గసీమలు
ఆనంద సాగరాలు
ఆ దేవుని నిలయాలు



**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# పారిశుద్ధ్య ప్రమాణాల్లో ఎటువంటి లోపాలు ఉండరాదు

**హోటళ్లు, రెస్టారెంట్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్లపై ప్రజారోగ్య సిబ్బంది క్షేత్రస్థాయి తనిఖీలు**

**విజయవాడ పశ్చిమ ఆగష్టు 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** హోటళ్లు, రెస్టారెంట్లలో పారిశుద్ధ్య ప్రమాణాల్లో ఎటువంటి లోపాలు ఉండరాదని, ఆర్ఓ వాటర్ ప్లాంట్ల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని మాత్రమే అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు స్పష్టం చేశారు. తాగునీటి నాణ్యతపై నిరంతరం అవసరమైన పరీక్షలు నిర్వహించి, నీరు సురక్షితమైనదని నిర్ధారించుకున్న తర్వాతే ప్రజలకు సరఫరా చేయాలని ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని గవర్నర్‌పేట, వన్‌టౌన్, బందర్ రోడ్ తదితర ప్రాంతాల్లో ప్రజారోగ్య విభాగం సిబ్బంది హోటళ్లు, రెస్టారెంట్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా



హోటళ్లు, రెస్టారెంట్లలోని వంటగది పరిశుభ్రత, కిచెన్ ప్లాట్‌ఫామ్, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, వంట సామగ్రి, ఆహార పదార్థాల నిర్వహణ, వంట అనంతరం ఉత్పత్తి అయ్యే వ్యర్థాల తొలగింపు, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి, వినియోగదారులకు అందించేలా నిర్వాహకులకు సూచనలు చేశారు. పారిశుద్ధ్య ప్రమాణాలను సక్రమంగా పాటించని సంస్థలపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు, లోపాలను వెంటనే సరిదిద్దుకోవాలని అధికారులు హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రమైన వంటగదిని నిర్వహిస్తూ, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని స్పష్టం చేశారు. ఆర్ఓ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు తాగునీటి నాణ్యతపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన నీటి పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని మాత్రమే అందించాలని అధికారులు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్లపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, పారిశుద్ధ్య ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో శానిటరీ సూపర్‌వైజర్లు అహ్మద్, సోమరాజు, రమేష్, ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ 2026 హియరింగ్ ప్రక్రియను పరిశీలించిన కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ ఆగష్టు 24 : (వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర సోమవారం సాయంత్రం మారుతి నగర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, ఎస్ఐఆర్ 2026లో భాగంగా జరుగుతున్న హియరింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా ఒక హియరింగ్‌ను నిర్వహించడంతో పాటు, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న హియరింగ్‌లను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ 2026లో భాగంగా అన్మ్యాప్డ్ కేసులకు సంబంధించి అర్హులైన ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నోటీసుల్లో పేర్కొన్న తేదీల్లో హియరింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హియరింగ్‌కు హాజరయ్యే ప్రజలు భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాలను సమర్పించినట్లయితే వారి ఓటు హక్కును పరిరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అవసరమైన పత్రాలను సమర్పించలేకపోయిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు నూతన ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. తద్వారా ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎవరైనా ఓటర్లకు నోటీసులు అందినప్పటికీ, అందులో పేర్కొన్న హియరింగ్ తేదీ దాటిపోయినట్లయితే వారు సంబంధిత ఏఈఆర్ఓ కార్యాలయాన్ని సంప్రదించి, హియరింగ్‌కు తప్పనిసరిగా హాజరై తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ పర్యటనలో ఏఈఆర్ఓ, పర్యవేక్షణ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) కే. దుష్యంత్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ పత్రాలు అందజేత



**విజయవాడ పశ్చిమ ఆగష్టు 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్. ఓ. సి ) లను జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యే , ఆదేశాలతో భవానిపురం, ఎన్డీయే కార్యాలయంలో కూటమి నేతలు బాధితులకు ఎల్ ఓ సీ పత్రాలను అందజేశారు...51 వ డివిజన్, కొత్త పేట కు చెందిన బీ సాయి లహరి(24) అనారోగ్యంతో పుట్టిన తన ఐదు రోజుల నవజాత శిశువు అత్యవసర వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 8 లక్షల 45 వేల ఎల్ ఓ సీ ను అందజేశారు... 45 వ డివిజన్ కు చెందిన గుండు సుమాంజలి( 32) నెలలు నిండని అనారోగ్యంతో పుట్టిన తన రెండు రోజుల నవజాత శిశువు మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ కొరకు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 19 లక్షల 96 వేల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు. అదేవిధంగా 54 వ డివిజన్, కొత్త పేట కు చెందిన గూడెల శ్రీనివాసరావు (54) మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 3 లక్షల 23 వేల విలువైన ఎల్ ఓ సీ ను కూటమి నేతలు అందజేశారుత్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు మాజీ కార్పొరేటర్లు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, షేక్ హబీబుల్లా, సుజనా న్యాయ మిత్రా బాయన హేరంబ కుమార్, బొమ్ము రాంబాబు, దేవిన హరి ప్రసాద్, కరిముల్లా, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

## వ్యక్తిగత జీవితాన్ని రాజకీయం చేశారు

**తన కుటుంబం మానసిక ఆవేదనకు గురి అయింది జోగి రమేష్**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24(వార్తా ప్రభ ప్రతినిధి):** తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల్లోకి లాగారని, కొన్ని రోజులుగా తాను, తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఆవేదనకు గురయ్యామని మాజీ మంత్రి, వైసీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుటుంబంపై గత నెల రోజులుగా జరుగుతున్న ప్రచారం, తన కుమారుడు రాజీవ్, మేఘన మధ్య వివాదం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు తదితర అంశాలపై జోగి రమేష్ స్పందించారు. తన కుమారుడు రాజీవ్‌కు మేఘనతో ఘనంగా వివాహం జరిపించామని తెలిపారు. అయితే రాజీవ్, మేఘన మధ్య కొన్ని మనస్పర్థలు, భేదాభిప్రాయాలు వచ్చాయని చెప్పారు. పిల్లలు కలిసి ఉండాలని తల్లిదండ్రులుగా తాము కోరుకుంటామని, విడిపోవాలని ఎప్పుడూ కోరుకోమని జోగి రమేష్ అన్నారు. 2026 జూన్ 8న తన కుమారుడు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించాడని, జూలై 24న మేఘన తన కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. విడాకుల వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున ఈ అంశంపై తాను ఎక్కువగా మాట్లాడలేనని చెప్పారు. రాజీవ్, మేఘన మధ్య కుటుంబ వివాదాన్ని వ్యక్తిగతంగా పరిష్కరించుకోవాల్సిన అంశంగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. గత నెల రోజులుగా తమ కుటుంబాన్ని మానసికంగా వేధించేలా కొన్ని కథనాలు ప్రసారం చేశారని జోగి రమేష్ ఆరోపించారు. తమ కుటుంబానికి కూడా భావోద్వేగాలు, బంధాలు ఉన్నాయని పేర్కొంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబంపై మతమార్పిడికి ప్రయత్నించారంటూ ప్రచారం చేశారని ఆరోపించారు. తన భార్య బైబిల్ చదవడం తప్పా, ఏసుక్రీస్తు బోధనలు వినడం తప్పా



అని ప్రశ్నించారు. తాము తిరుపతి, దుర్గగుడికి వెళ్తామని, యాగాల్లో కూడా పాల్గొంటామని తెలిపారు. ఐటీడీపీ ద్వారా నెల రోజులుగా తమ కుటుంబంపై ప్రచారం చేశారని ఆరోపించారు. వ్యక్తిగత విషయాల్లోకి రావద్దని, చేతనైతే రాజకీయంగా తనపైకి రావాలని సవాల్ విసిరారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను భయపడలేదని, తన గొంతు నొక్కాలని ఎంత ప్రయత్నించినా వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందుకే తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని జోగి రమేష్ ఆరోపించారు. ఏ కుటుంబంలో సమస్యలు లేవో చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వసంత కార్యాలయంలో రాజకీయాలు చేయడం సమంజసమేనా అని ప్రశ్నించారు. తాను దమ్ముగా రాజకీయాలు చేస్తానని, వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లనని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్ బుక్ పేరుతో తన కుటుంబాన్ని ఎక్కువగా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. తన గొంతు నొక్కాలని ఎంతగా ప్రయత్నించినా ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు. మహా టీవీ వంశీని ఉద్దేశించి కూడా జోగి రమేష్ పలు వ్యాఖ్యలు చేశారు.

## అనవసర విషయాలలో జోక్యం చేసుకునే వ్యక్తిత్వం నాది కాదు

**జోగి రమేష్ వ్యాఖ్యలపై స్పందించిన ఆరోపణలపై ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24(వార్తా ప్రభ ప్రతినిధి):** అనవసర విషయాల్లో తాను జోక్యం చేసుకునే వ్యక్తిని కాదని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు. మాజీ మంత్రి జోగి రమేష్ చేసిన ఆరోపణలపై ఇబ్రహీంపట్నంలో సోమవారం ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వసంత మీడియా ఎదుట స్పందించారు. శాసనసభ్యుల కార్యాలయానికి నిత్యం ఎంతోమంది వస్తుంటారని తెలిపారు. అదేవిధంగా మేఘన, ఆమె కుటుంబ సభ్యులు కూడా తన కార్యాలయానికి వచ్చినట్లు చెప్పారు. ప్రజాప్రతినిధిగా తన కార్యాలయానికి ఎవరైనా రావచ్చని, ఎవరైనా వెళ్లవచ్చని పేర్కొన్నారు. కుటుంబ వ్యవహారం కావడంతో ఇరు వర్గాలు మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలని తాను సలహా ఇచ్చినట్లు ఎమ్మెల్యే వసంత తెలిపారు. ఈ విషయంలో తాను ఎలాంటి జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. తన వ్యక్తిత్వం అందరికీ తెలిసిందేనని



అన్నారు. అనవసర విషయాల్లో జోక్యం చేసుకోవడం తనకు అలవాటు లేదని పేర్కొన్నారు. కుటుంబ వ్యవహారాలను రాజకీయ అంశాలతో ముడిపెట్టకుండా సంబంధిత వ్యక్తులు మాట్లాడుకుని పరిష్కరించుకోవడం మంచిదని సూచించారు.

## మార్షల్ ఆర్ట్స్ లో కొండపల్లి కుర్రాడికి గోల్డ్ మెడల్

**కన్నమాల ఇవాన్ రాయేల్ కు గోల్డ్ మెడల్ అందజేసిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ**





**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి శాంతినగర్ కు చెందిన కన్నమాల ఇవాన్ రాయేల్ అరుదైన గౌరవం దక్కించుకున్నాడు. మార్షల్ ఆర్ట్స్ లో చూపిన విశిష్ట ప్రతిభను గుర్తించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ గోల్డ్ మెడల్ ప్రధానం చేసింది. 8 ఏళ్ళ కన్నమాల ఇవాన్ రాయేల్ ఏప్రిల్ నెల లో హైదరాబాద్ గచ్చిబౌలి లో జరిగిన విజన్ మార్షల్ ఆర్ట్స్ తరపున కరాటే పోటీలలో పాల్గొని తన విశిష్ట ప్రతిభను కనబరిచాడు. అతి చిన్న వయసులో (8) ప్రతిభ చూపిన సందర్భంగా ఈ అవార్డును అందజేశారు. ఆగస్టు 22న తెలంగాణ షీ పవర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో జరిగిన అవార్డు ప్రధాన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్, మహేష్ బాబు భార్య నమ్రత శిరోద్కర్,9వ నిజాం రాజా వంశనికి చెందిన నవాబ్ రౌనక్ ఖాన్ లాంటి ప్రముఖులు కన్నమాల ఇవాన్ రాయేల్ ను ఘనంగా సన్మానించి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. అతి తక్కువ వయసులో విశిష్ట ప్రతిభ కనబరిచి అవార్డును సొంతం చేసుకున్న ఇవాను పలువురు అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో అవార్డులు రివార్డులు అందుకోవాలని ఆశీర్వచనాలు అందజేశారు.

## మెగాస్టార్ చిరంజీవికి భారతరత్న అవార్డు ఇవ్వాలి

**కేంద్ర ప్రభుత్వానికి ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ వినతి**



**విజయవాడ పశ్చిమ ఆగస్టు 24: (వార్త ప్రభ ప్రతినిధి)** ప్రముఖ సినీ నటుడు, సామాజిక సేవా తత్పరుడు మెగాస్టార్ చిరంజీవికి భారతరత్న అవార్డు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. భారతీయ చలనచిత్ర రంగానికి, విశేషించి తెలుగు సినిమా వైభవానికి దశాబ్దాలుగా అసమాన సేవలు అందిస్తున్న మెగాస్టార్ డాక్టర్ కే. చిరంజీవి కి దేశ అత్యున్నత పౌర పురస్కారమైన "భారత రత్న" ప్రదానం చేయాలని ప్రముఖ నటులు, సీనియర్ రాజకీయ నాయకులు మురళీ మోహన్ కోరడం అత్యంత అభినందనీయమని, మురళీ మోహన్ వ్యక్తం చేసిన అభిప్రాయానికి సంపూర్ణ మద్దతు తెలియ చేశారు. గత ఐదు దశాబ్దాలుగా నటుడిగా, డాన్సర్‌గా, కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న నటుడిగా చిరంజీవి తెలుగు సినిమా స్థాయిని అంతర్జాతీయ వేదికపై నిలబెట్టారని ఆకుల శ్రీనివాస్ కొనియాడారు. సామాజిక సేవలో భాగంగా "చిరంజీవి బ్లడ్ బ్యాంక్" మరియు "ఐ బ్యాంక్" ద్వారా లక్షలాది మంది ప్రాణాలను కాపాడటమే కాకుండా, కరోనా సంక్షోభ సమయంలో చిత్రపురి కార్మికులను ఆదుకోవడంలో ఆయన చూపిన మానవత్వం అసమానమైనదన్నారు. భారత ప్రభుత్వం ఆయనకు ప్రకటించిన 'పద్మవిభూషణ్' గౌరవం ఆయన కళా సేవకు దక్కిన గొప్ప గుర్తింపు. అయితే కళ మరియు సామాజిక రంగాలలో ఆయన అందించిన అపూర్వ సేవలకు అత్యున్నత పౌర పురస్కారమైన "భారత రత్న" లభించడమే సముచితమైన గౌరవమని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలుగు వారందరి తరఫున, కళాభిమానులందరి తరఫున కేంద్ర ప్రభుత్వం మెగాస్టార్ చిరంజీవి ని "భారత రత్న" పురస్కారంతో గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి - జిల్లా రెవెన్యూ అధికారి



**మచిలీపట్నం ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల నుంచి అందుతున్న అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే శ్రీధర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కెఆర్ఆర్సీ ఎస్‌డీసీ పి. నీలకంఠేశ్వరరెడ్డి, మెప్మా పీడీ సాయిబాబు, దిశ పోలీస్ స్టేషన్ సీఐ వి. వెంకటేశ్వరరావుతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వివిధ సమస్యలపై సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని డీఆర్వో సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థినికి గీతాగోవిందం సేవా సొసైటీ 27,500 ఆర్థిక సహకారం



**తిరుపతి, ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గీతా గోవిందం సేవ సొసైటీ తరఫున పి. సుజీ యాదవ్ మెరిట్ స్టూడెంట్ ఎంబీఏ చదువుతున్న అమ్మాయికి చదువు నిమిత్తం 27,500 రూపాయలను, ఆర్థిక సహాయం అందచేస్తూ.. భవిష్యత్తులో అవసరమైన సమయంలో మిగిలిన అమౌంట్ అందచేస్తామని తెలిపారు. ఆ అమ్మాయి తల్లి తిరుపతి లో ఇల్లాలో పాచి పనిచేసుకుంటూ ఆ అమ్మాయిని చదివిస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గీతా గోవిందం సేవా సమితి సొసైటీ ప్రస్తుత ప్రెసిడెంట్ బాల గుర్రప్ప యాదవ్ మరియు ఫౌండర్ ప్రెసిడెంట్ దామోదర రావు యాదవ్ , సెక్రటరీ: కాకులూరు గుణశేఖర్ యాదవ్, అలాగే మాజీ అడిషనల్ ఎస్పీ నంజుండప్ప అలాగే ఆ అమ్మాయి పి. సుజి యాదవ్ తల్లి పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు 5వ రోజు జ్ఞానజ్యోతి శిక్షణ



**చేజర్ల ఆగష్టు 24 (వార్తాప్రభ)** స్త్రీ మరియు శిశు సంక్షేమ విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగే 5వ రోజు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమానికి ఐసిడిఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సిడిపిఓ పి.సునీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో నేర్పించే అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకొని అంగన్వాడీ కేంద్రాల యందు అన్ని కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆధార్ షీలా గురించి నవచేతన మరియు అంగన్వాడీ పిల్లలకు ఇంగ్లీషు నేర్పించడం లింగ సమానత్వం కమ్యూనిటీ భాగస్వామ్యం పాఠశాల సంసిద్ధత తరగతి గది ఏర్పాటు పోషణ మరియు ఆరోగ్యము ఈ కార్యక్రమాల పట్ల ప్రతి కార్యకర్త అవగాహన కలిగి ఉండేలా క్షేత్రస్థాయిలో అన్ని కార్యక్రమాలు సక్రమంగా జరిగేటట్లు చూడాలని కార్యకర్తలందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమం లో చేజెర్ల మండలం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.పద్మ స్కూల్ టీచర్స్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మచిలీపట్నం మేయర్ పదవి బీజేపీకే కేటాయించాలి




**మచిలీపట్నం ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో మేయర్ పదవిని బీజేపీకి కేటాయించాలని స్థానిక పార్టీ నాయకులు కోరారు. కృష్ణాజిల్లా బీజేపీ అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పార్టీలైన టీడీపీకి మంత్రి పదవి, జనసేనకు ఎంపీ పదవి లభించిన నేపథ్యంలో మిత్రధర్మాన్ని పాటిస్తూ మచిలీపట్నం మేయర్ పదవిని బీజేపీకి కేటాయించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనిపై రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో చర్చిస్తానని తాతినేని శ్రీరామ్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని ఆయన సూచించారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుత్తికొండ రాజబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతం వెంకట గజేంద్రరావు, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమచర్ల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు 5 వ రోజు " జ్ఞాన జ్యోతి " ట్రైనింగ్......



**పెనుగంచిప్రోలు – ఆగష్టు 24( వార్త ప్రభ )** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్టు ఐసిడిఎస్ సి.డి.పి.ఓ సత్యవతి ఆదేశాల మేరకు చిల్లకల్లు ప్రాజెక్టు పరిధిలోని పెనుగంచిప్రోలు కె.వి.ఆర్ జడ్పీ హైస్కూల్ నందు సోమవారం జగ్గయ్యపేట వత్సవాయి పెనుగంచిప్రోలు మూడు మండలాల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు 5వ రోజు జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ప్రీస్కూల్ పిల్లలకు సమతుల్య ఆహారం మరియు పర్సనల్ హైజిన్ గురించి చెప్పవలసిన ప్రీ స్కూల్ మెటీరియల్ పై అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో కెవిఆర్ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం జలజ , రిసోర్స్ పర్సన్స్, కామ నాగేశ్వరరావు మర్రి ప్రభాకర్,ఆరేపల్లి ప్రకాష్,ఐసిడిఎస్ సూపర్వైజర్స్ రజనీ జ్వాల, వెంకట కుమారి అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు...

## యువత ఆధ్వర్యంలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు....



**పెనుగంచిప్రోలు - ఆగస్టు24 ( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు తూర్పు బజారు, ముత్యాలమ్మ గుడి సెంటర్ నందు చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగాస్టార్, పద్మవిభూషణ్ డా. కొణిదెల చిరంజీవి జన్మదిన వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు,చిరంజీవి మరిన్ని చిత్రాలతో, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత పెనుగంచిప్రోలు మండల అధ్యక్షులు చంద్రకంటి నవీన్ కుమార్, బీసీ కోర్పొరేషన్ రాష్ట్ర డై రెక్టర్ తునికిపాటి శివ, తన్నీరు గోపీనాథ్, చిన్నం గోపి, రామసాని గోపి, జనసేన పార్టీ పెనుగంచిప్రోలు గ్రామ అధ్యక్షులు దొడ్ల వినయ్ కుమార్, కందుకూరు నవీన్ ఏలూరి నాగరాజు,సుంకర నాగరాజు,నాగు ఉదయ్ చారి శంకర్ మరియు చిరంజీవి వీరాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనా మహోత్సవాలు



**సంగం ఆగస్టు 24 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం పట్టణంలోని శ్రీ వెంకయ్యస్వామి ఆలయాల్లో ఆరాధనా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.ఆరాధనా మహోత్సవాల సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి స్వామివారికి సుప్రభాత సేవ అభిషేకాలు ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి నామస్మరణ భజనలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆరాధనా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు భక్తులు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## ఘనంగా ఉప్పలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు



**మల్కాజిగిరి ఆగస్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి):** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్ లో గల పాల ఉప్పలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలతో పాటు భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పుష్పలత, సరిత, ఉమా, శ్రీనివాస్, పీవీ సత్యనారాయణ, శ్రీకాంత్ మేకల రాము మిరియాల రామచందర్, బాలరాజు యాదవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణానికి రైతుల ఉదారత

### 17 సెంట్ల భూమి స్వచ్ఛందంగా అందజేత

### స్వచ్ఛందంగా అందించిన రైతులు సుంకర సర్వేశ్వరరావు సుంకర రామకృష్ణ



**కోదూరు, ఆగస్టు 24 (వార్త ప్రభ):** దాదాపు 25 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యను పరిష్కరించేందుకు ఇద్దరు రైతులు ముందుకు వచ్చారు. రహదారి నిర్మాణం కోసం తమ భూమిలోని 17 సెంట్ల స్థలాన్ని స్వచ్ఛందంగా అందజేసి ఆదర్శంగా నిలిచారు.కోదూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామ పంచాయతీ శివారు హరిపురం నుంచి సాలెంపాలెం లింగన్నకోడు--సాలెంపాలెం డొంక రోడ్డు వరకు సరైన రహదారి మార్గం లేకపోవడంతో ఈ ప్రాంతంలోని రైతులు, వ్యవసాయ పనులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పంటలను పొలాల నుంచి తరలించేందుకు అనేక అవస్థలు పడుతున్నామని స్థానిక రైతులు తెలిపారు.ఈ సమస్యను దృష్టిలో ఉంచుకున్న హరిపురం గ్రామానికి చెందిన సుంకర సర్వేశ్వరరావు, సుంకర రామకృష్ణ తమకు చెందిన 17 సెంట్ల వ్యవసాయ భూమిని రహదారి నిర్మాణానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.ఈ మేరకు సోమవారం కోదూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపిఆర్డి రాజనాల నాగరేవతి, ఉల్లిపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి కమ్మిలి లీలా ప్రియాంక సమక్షంలో అంగీకార పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా రైతు వేములపల్లి రత్నాకర్‌రావు మాట్లాడుతూ.. సుమారు 25 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక స్థానిక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి తమ భూమిని స్వచ్ఛందంగా అందించిన సుంకర సర్వేశ్వరరావు, సుంకర రామకృష్ణలను అధికారులు అభినందించారు.కార్యక్రమంలో ఉల్లిపాలెం పీఏసీఎస్ అధ్యక్షులు బోలిశెట్టి విట్టల్‌రావు, ఆరేపల్లి లక్ష్మీనారాయణ, వేములపల్లి మాధవరావు, కుర్ర లక్ష్మీనారాయణతో పాటు పలువురు రైతులు

# దుండిగల్ జడ్పీహెచ్ఎస్ 1977-78 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 48 ఏళ్ల తర్వాత సూరారార్‌లో కలుసుకున్న బాల్య మిత్రులు
- కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వేడుకగా సాగిన పూర్వ విద్యార్థుల కలయిక







**సూరారం, ఆగస్టు 24, (వార్తాప్రభ)** : మేడ్చల్ జిల్లా పరిధిలోని దుండిగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) 1977-78 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో ఆత్మీయంగా సమావేశమయ్యారు. సుమారు 48 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బాల్య మిత్రులంతా ఒకే చోట కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని నింపిందని పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఆనాడు తమ తరగతిలో 22 మంది విద్యార్థులు ఉండే వారని, వారిలో కిషన్ రావు, చక్రధర్, మైమూత్, కృష్ణ, బలరాం అనే ఐదుగురు స్నేహితులు కాలధర్మం చెందారని గుర్తుచేసుకున్నారు. సమావేశం ప్రారంభంలో మరణించిన స్నేహితుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అప్పట్లో పదో తరగతిలో ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణులయ్యారని, వారిలో జె. శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఎఫ్‌సీలో ఉద్యోగం చేయగా, మోహన్ ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రభుత్వ డాక్టర్‌గా సేవలు అందించారని తెలిపారు. అలాగే కొండల్ రెడ్డి ఆర్ అండ్ బి శాఖలో ఉద్యోగం చేసి నైవృత్తి (రిటైర్డ్) పొందారు. అప్పట్లో చదువులో వెనుకబడి పదో తరగతి తప్పినప్పటికీ, నిరాశ చెందకుండా వ్యాపారాలు, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యవసాయ రంగాల్లో స్థిరపడి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నామని వారు పేర్కొన్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి, మంచి ఉద్యోగాల్లో, విదేశాల్లో స్థిరపడేలా తీర్చిదిద్దడం ఎంతో గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ కుమారుడు కోల శ్రీకాంత్ (సివిల్ ఇంజనీర్) మరియు తమ్ముడు వెంకటేష్ కుమారుడు కోల అరవింద్ (డాక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్) విచ్చేసిన పూర్వ విద్యార్థులందరినీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. అప్పటి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ అందరూ సంతోషంగా గడిపారు. వయోధికులుగా ఉన్న తామంతా ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి కలుసుకోవాలని ఈ సందర్భంగా తీర్మానించారు. అనివార్య కారణాల వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయిన పోలీస్ సురేందర్ రెడ్డి, కుమార్ గౌడ్, పద్మారావు, రామకృష్ణారెడ్డి తదితరులను తదుపరి సమావేశానికి తప్పకుండా వచ్చేలా చూడాలని నిర్ణయించారు. తదుపరి ఆత్మీయ సమ్మేళనాన్ని తమ బాల్య జ్ఞాపకాలు ముడిపడి ఉన్న దుండిగల్ పాఠశాల ప్రాంగణంలోనే నిర్వహించుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

**ప్రసంగించిన పూర్వ విద్యార్థులు:**లిడాక్టర్ మోహన్: మనుమలు, మనుమరాళ్లను ఉన్నత చదువులు చదివించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు.కొండల్ రెడ్డి:ప్రస్తుత కాలంలో వ్యవసాయ రంగంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

సత్తిరెడ్డి: యువత పారిశ్రామిక రంగంలో భాగస్వాములై వ్యాపార రంగాన్ని ఎంచుకోవాలని సూచించారు.

శ్రీనివాస్ గుప్తా:ఈ మధురమైన కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన రవీందర్, శేఖర్, కొండల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

రాజేశ్వరరావు: తాను మెడికల్ షాప్ నిర్వహిస్తున్నానని, ఉద్యోగాల కంటే సొంత వ్యాపారాలే మిన్న అని అభిప్రాయపడ్డారు.

కోల రవీందర్ ముదిరాజ్: "మనం చదువులో వెనుకబడినప్పటికీ సమాజంలో నిలదొక్కుకుని పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాం. మన పిల్లలు విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారంటే అది తల్లిదండ్రుల, చదువు చెప్పిన గురువుల ఆశీర్వాదమే. ఇప్పటికీ నేను నా తల్లిదండ్రుల వద్దే ఉంటూ వారి సేవలో తరిస్తున్నాను" అని తెలిపారు.

# అనధికార నిర్మాణాలపై ఎన్ఫోర్స్మెంట్ అధికారుల చర్యలు ముమ్మరం

### 28 భవనాలకు నోటీసులు, 9 భవనాల కూల్చివేత, మరో భవనాన్ని సీజ్ చేసిన అధికారులు













**శేరిలింగంపల్లి,ఆగస్టు 24 (వార్తాప్రభ):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు చర్యలు ముమ్మరం చేశాయి. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం 38 అనధికార నిర్మాణాలను గుర్తించి చర్యలు చేపట్టారు. ఇందులో 28 భవనాలకు యూసీ నోటీసులు జారీ చేయగా, ఒక భవనాన్ని సీజ్ చేసి, మరో 9 భవనాలను కూల్చివేశారు.75 చదరపు గజాల్లోపు స్థలాల్లో 7 మీటర్లకు మించి ఎత్తుతో నిర్మిస్తున్న భవనాలతో పాటు, 75 చదరపు గజాలకు పైబడిన స్థలాల్లో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించారు. ప్రజల ఫిర్యాదులు, క్షేత్రస్థాయి బృందాల తనిఖీల ద్వారా అనధికార నిర్మాణాలను గుర్తిస్తున్నట్లు అధికారులు తెలిపారు.కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

# డ్రగ్స్ వద్దు - దేశం ముద్దు" నినాదంతో 9,000 కి.మీ బైక్ యాత్ర

### బైక్ రైడ్ ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్





**ఇబ్రహీంపట్నం,ఆగస్టు 24(వార్తా ప్రభ ప్రతినిధి)**యువతను మాదకద్రవ్యాల బారి నుంచి కాపాడటంతో పాటు దేశభక్తి, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఇబ్రహీంపట్నంకు చెందిన యువకుడు పల్లపు శ్రీ వేద ఆదిత్య చేపట్టిన 9,000 కిలోమీటర్ల సోలో బైక్ రైడ్‌కు మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ సంఘీభావం తెలిపారు."డ్రగ్స్ వద్దు -- దేశం ముద్దు" అనే నినాదంతో చేపట్టిన ఈ బైక్ యాత్రను సోమవారం ఉదయం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రికుడికి శుభాకాంక్షలు తెలిపారు.ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ పూర్వ విద్యార్థి అయిన శ్రీ వేద ఆదిత్య ఇబ్రహీంపట్నం నుంచి లడఖ్, కాశ్మీర్, కన్యాకుమారి మీదుగా తిరిగి ఇబ్రహీంపట్నం చేరుకునేలా సుమారు 23 రోజుల పాటు 9,000 కిలోమీటర్ల సోలో బైక్ రైడ్ చేపట్టారు.

**యువతలో చైతన్యమే లక్ష్యం** యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడం, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం, దేశభక్తి భావాన్ని పెంపొందించడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ యువతలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం అభినందనీయమన్నారు. యువత శక్తిని సానుకూల దిశగా మళ్లించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్రావు (గాంధీ), టిడిపి సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య మృతి భర్తకు తీవ్ర గాయాలు

### జాతీయ రహదారి పై గుంటుపల్లి లో ఘటన



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24(వార్తా ప్రభ ప్రతినిధి):**విజయవాడ--హైదరాబాద్ జాతీయ రహదారిపై గుంటుపల్లి సెంటర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటుపల్లి ఖాజీపేట అంజని గ్రీన్ పార్క్‌లో నందం బాలగంగాధరరావు కుటుంబం నివసిస్తోంది. సోమవారం బాలగంగాధరరావు (61) తన భార్య నిర్మల జ్యోతి (56)తో కలిసి ద్విచక్ర వాహనంపై వన్‌టౌన్‌లోని వారి బంగారు నగల దుకాణానికి పనికి బయలుదేరారు.కొద్ది నిమిషాల్లోనే గుంటుపల్లి సెంటర్‌లో వారి ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నిర్మల జ్యోతి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రమాదంలో ఆమె తల భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. బాలగంగాధరరావు కూడా తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నిర్మల జ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గుంటుపల్లి సెక్టార్ ఎస్సై సత్యవతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సాయి చంద్రానగర్ వాసులకు తీరనున్న త్రాగునీటి కష్టాలు



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24(వార్తా ప్రభ ప్రతినిధి):** దీర్ఘకాలంగా త్రాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్న కొండపల్లి మున్సిపాలిటీ 28 వ వార్డు పరిధిలోని సాయి చంద్ర నగర్ వాసుల కష్టాలు తీరనున్నాయి. పాత పైప్లైన్ వలన త్రాగునీటిలో మురికి నీరు కలిసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి నూతన పైప్ లైన్ నిర్మాణం కోసం మున్సిపాలిటీ ద్వారా నిధులు కేటాయించి పైపులైన్ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నట్లుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన స్థానిక నాయకులు సాయి చంద్ర నగర్ వాసులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసవ ఉమా, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి అఫ్సర్, జనసేన పట్టణ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, గాదె రేవంత్, గిరి తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించారు.

## పిఏసిఎస్ చైర్మన్ గా చింతా రవికుమార్ ప్రమాణస్వీకారం







**పెనుగంచిప్రోలు - ఆగస్టు 24( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం లోని నవాబుపేట నూతన పీఏసీఎస్ చైర్మన్ గా చింతా రవికుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం , నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీ రామ్ చిన్నబాబు హాజరై నూతన చైర్మన్ ను అభినందించారు.ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ సహకార వ్యవస్థలో పీఏసీఎస్‌లు రైతులకు మరింత చేరువగా పనిచేయాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా సేవలను విస్తరించాలని సూచించారు. చింతా రవికుమార్ నాయకత్వంలో నవాబుపేట పీఏసీఎస్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ గోరంట్ల రాయప్ప , డైరెక్టర్ జంగాల కోటేశ్వరమ్మ , నీటి సంఘం అధ్యక్షులు గింజుపల్లి వెంకటయ్య , తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నంబూరి వెంకటేశ్వరరావు , తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తవరపు వెంకటేశ్వరరావు , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జామ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు..నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చింతా రవికుమార్ కి పలువురు నాయకులు, కార్యకర్తలు, సహకార సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ ధనయ్య జన్మదిన వేడుకలు



**కంకిపాడు ఆగస్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కంకిపాడు వ్యవసాయ మార్కెట్‌యార్డ్ చైర్మన్ అన్నే ధనయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వగృహంలోని ప్రాంగణంలో కేక్ కట్ చేసి చైర్మన్‌కు నాయకులు, కార్యకర్తలు, మార్కెట్‌యార్డ్ సిబ్బంది, రైతులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.చైర్మన్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం, మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి ఆయన మరింతగా సేవలందించాలని పలువురు కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు రాధాకృష్ణమూర్తి, కొండవీటి శివయ్య, బొడ్డు నాగమల్లేశ్వరరావు, కొండలరావు, ప్రసాద్, వీరస్వామి జ్యోజి,నాయకులు, కార్యకర్తలు, మార్కెట్‌యార్డ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలి..

### నిందితుడిని కఠినంగా శిక్షించాలి..



**కాకినాడ : ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నాగరాజు కుటుంబానికి జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం కాకినాడలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు మరియు హిందూ సంఘాల నాయకులు, పెద్దేత్తున హిందువులు మహిళలుబాలాజీ చెరువు నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. నాగరాజు కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాదిక్ ఖాన్‌పై తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి,కఠిన శిక్ష విధించాలని కోరారు. అలాగే "లవ్ జిహాద్" కేసులను వేగంగా విచారించి, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినట్లు తేలిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా,సాదిక్ ఖాన్‌కు అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై కూడా సంబంధిత దర్యాప్తు సంస్థల ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని హిందూ చైతన్య వేదిక నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పి.వెంగళ రావు, అప్పాజీ, కంబాల శ్రీనివాసరావు, మాలకొండయ్య,ముత్తా నవీన్, వీహెచ్‌పి పట్నాయక గోవిందు రాజు భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్తా నవీన్ కృష్ణ , బిజెపి సీనియర్ నాయకులు పైడా భావన ప్రసాద్, సివిల్ సప్లై డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య, బిజెపి కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి సాహితీవర్మ, కుండల సాయికుమార్ యాదవ్, చోడిశెట్టి రమేష్ బాబు, యువ మోర్చా అధ్యక్షులు పార్థసారథి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఘంటసాల గోవిందరాజులు, చెక్క రమేష్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ స్టేట్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి జేటి రాజేంద్రప్రసాద్ ఎన్నిక



**విస్సన్నపేట ఆగష్టు 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏపీ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జేటి రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. 22, 23 తేదీలలో ఏలూరులో జరిగిన ఎన్నికలలో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట యూనిట్ నుండి ఆయన ఎన్నిక కావడంతో విస్సన్నపేట పరిసర ప్రాంత మండలాల నుండి పలువురు అభినందనలు తెలియజేశారు.

# గుడివాడలో వైద్య రంగంలో మరో ముందడుగు..

● ఏఐ టెక్నాలజీతో శ్రీ సిద్ధి అడ్వాన్స్‌డ్ ఫీటల్ కేర్ సెంటర్ ప్రారంభం

● గుడివాడలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం - గర్భస్థ శిశువు ఆరోగ్యం ఇక సురక్షితం





**గుడివాడ,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** గుడివాడ వైద్య చరిత్రలో మరో నూతన అధ్యాయం ప్రారంభమైంది. ఇప్పటివరకు హైదరాబాద్, చెన్నై వంటి కార్పొరేట్ నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే అత్యాధునిక ఏఐ ఆధారిత ఫీటల్ పరీక్షలు ఇప్పుడు మన గుడివాడలోనే అందుబాటులోకి వచ్చాయి. ఏలూరు రోడ్డులోని 35వ వార్డు, మండువా రెస్టారెంట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సిద్ధి అడ్వాన్స్‌డ్ ఫీటల్ కేర్ సెంటర్ను సోమవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఘనంగా ప్రారంభించారు. ఐఎంఏ ప్రతినిధులు, పట్టణ ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

**గర్భంలోనే శిశువు ఆరోగ్య పరీక్ష - ముందే గుర్తింపు, ముందే చికిత్స !..** ఈ సందర్భంగా సెంటర్ డైరెక్టర్ డాక్టర్ అంకెం జయ శ్రావణి మాట్లాడుతూ.. "అత్యాధునిక స్కానింగ్, ఏఐ టెక్నాలజీ ద్వారా కడుపులోని శిశువు ఎదుగుదల, గుండె, మెదడు, ఇతర అవ-యవాల ఆరోగ్య సమస్యలను నెలల ముందే గుర్తించవచ్చు. అవసరమైతే గర్భంలోనే చికిత్స అందించే ఆధునిక వైద్యం కూడా ఇక్కడ అందుబాటులో ఉంది. అన్ని పరీక్షలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే నిర్వహిస్తాం" అని వివరించారు.

**ఎమ్మెల్యే రాము ప్రశంసలు..** ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ "ఆధునిక వైద్యాన్ని గుడివాడకు తీసుకురావడం అభినందనీయం. గర్భిణీలకు ఇకపై పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. గుడివాడ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ మాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ "రేడియాలజీలో వచ్చిన అత్యాధునిక టెక్నాలజీ గుడివాడకు రావడం గొప్ప విషయం. ఇది తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది" అని అన్నారు.

**ప్రారంభోత్సవంలో...** ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ సుందరయ్య, కార్యదర్శి డాక్టర్ సూరజ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, నాయకులు చేకూరు జగన్మోహన్ రావు, దేవరపల్లి కోటి, రెడ్డి షణ్ముఖ, పోలాసి ఉమా తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన పరిష్కారమే.. నిబద్ధతకు నిదర్శనం

● కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సాకారం కావాలి ● ప్రజల సంతృప్తే ఫిర్యాదు పరిష్కారానికి అసలైన కొలమానం ● జిల్లాస్థాయి ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్‌కు 192 అర్జీలు

● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును కేవలం అర్జీగా కాకుండా.. ఒక కుటుంబం లేదా వ్యక్తి ఎదుర్కొంటున్న సమస్యగా భావించి సత్వర, నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు పరిష్కారం కాగితాలపై లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పూర్తికాదని, సమస్యకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిష్కారం లభించినప్పుడే అది నిజమైన పరిష్కారంగా పరిగణించాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 192 అర్జీలు అందగా రెవెన్యూ 66, పురపాలక పట్టణాభివృద్ధి 52, పోలీసు 22, పంచాయతీరాజ్‌కు 17 అర్జీలు రాగా వైద్య ఆరోగ్యం, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖకు ఆరు చొప్పున అర్జీలు అందాయి. వ్యవసాయం, ప్రజా రవాణా, కాలేజీ విద్య, పాఠశాల విద్య, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, రహదారులు, భవనాల శాఖలకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. విద్యుత్, పౌర సరఫరాలు, సహకార, అటవీ, ఆర్ఐవో, గ్రామీణ నీటిసరఫరా, గిరిజన సంక్షేమం శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో సంబంధిత అధికారులు ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి, సమస్య పరిష్కారమైన తీరును తెలుసుకోవడంతో పాటు వారి సంతృప్తిని నిర్ధారించుకోవాలని సూచించారు. తీసుకున్న చర్యలు, పరిష్కారం వివరాలు స్పష్టంగా ఉండేలా ఎండార్స్‌మెంట్లు రూపొందించాలని ఆదేశించారు. ప్రజల సంతృప్తే ఫిర్యాదు పరిష్కారానికి అసలైన కొలమానమని.. పాలనపై ప్రజలకు నమ్మకం మరింత పెరగాలంటే ప్రతి ఫిర్యాదుకు నిజమైన, పారదర్శకమైన, క్షేత్రస్థాయి పరిష్కారం అందాలన్నారు. పీజీఆర్ఎస్‌ను ప్రజలకు అండగా నిలిచే సమర్థవంతమైన వ్యవస్థగా మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషిచేయాలని పేర్కొన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు సహా సంబంధిత అధికారులు ఆన్‌లైన్ సమీ క్షలకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, సమీక్షల్లో ప్రస్తావించే ప్రతి అంశంపై స్పష్టమైన వివరాలు అందిస్తూ జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఆదేశించారు. అప్పగించిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయకుండా, ఫిర్యాదుల పరిష్కారంలో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జెడ్పీ సీఈవో జె.అరుణ, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జె.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నాబార్డ్ సర్వేపై వడ్డాది రాజేష్ విమర్శలు

గ్రామీణ ఆర్థిక పరిస్థితి మందగమనంలో - కూటమి ప్రభుత్వంపై అగ్రహం



**గుడివాడ,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** దేశ గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితి మందగ మనలో సాగుతుందని నా బార్ట్ ఆర్ ఇ సి ఎస్ ఎస్ సర్వే నివేదిక విశ్లేషించి ప్రకటన చేయడం విచారకరణమని గుడివాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డాది రాజేష్ ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. గ్రామీణ పాత ప్రజలు మరియు పట్టణ పాత ప్రజలు గత రెండు సంవత్సరాలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని బిజెపి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి నిత్య అవసరాల సరుకులు పెరిగిపోవడం పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలు పెరగడం వ్యవసాయ పనులు తగ్గడంలో రైతులు కూలీలు తోపాటు పట్టణ ప్రాంతంలో గల షాపు యజమానులు వ్యాపారం లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని 2024 సంవత్సరం నా బార్డ్ సర్వే మొదలు దగ్గర నుండి దాదాపు 20 శాతం ప్రజలు ఆదాయం తగ్గిందని హార్థిక మందంగా మనం నుండి పేద ప్రజలను కాపాడవలసిందిగా ప్రజాపాలకులు రాజకీయాలు ప్రకటన చేయడం తప్పు ప్రజలను వదిలేసారని ఇప్పటికైనా బీజేపీ తెలుగుదేశం జనసేన అధికారంలో పార్టీలు ఈ ఆర్థిక పరిస్థితి నుండి పేద ప్రజలకు అండగా ఉండలేని పక్షంలో రాబోయే ప్రాతిక పంచాయతీ ఎంపీటీసీ జడ్పీటీసీ మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర వ్యతిరేకాలు వస్తుందని వడ్డాది రాజేష్ హెచ్చరించారు.

# సంచలన హత్య కేసులో నిందితుడు సాదిక్ ఖాన్ అరెస్ట్

● మతమార్పిడి, బెదిరింపుల అంశాలపై సమగ్ర దర్యాప్తు ● జిల్లా ఎస్పీ బిందు మాధవ్







**కాకినాడ, ఆగష్టు 24 (వార్తాప్రభ) :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ ఏఈ టిల్లపూడి నూకరాజు, అతని భార్య మీనా, కుమార్తె కొవ్వూరి సౌజన్య ఆత్మహత్యకు సంబంధించిన అంశంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు షేక్ సాదిక్ ఖాన్‌ను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సంచలన హత్య కేసు విషయంపై సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ విషయాలను వెల్లడించారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ప్రత్యేక చొరవతో ఆరు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

**రాజమండ్రి ఘటనతో వెలుగులోకి వచ్చిన కేసు..** ఈ నెల 16వ తేదీన ఉదయం 10.30 నుంచి 11.30 గంటల మధ్య జగదీష్ రెడ్డి భార్య కొవ్వూరి సౌజన్య, ఆమె తల్లిదండ్రులు తిల్లపూడి నూకరాజు, మీనా, కుమారుడు రియాన్స్ కార్తికేయ రెడ్డి రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలో జరిగిన ఘటనకు సంబంధించిన సమాచారం పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ ఘటనలో రియాన్స్ ప్రాణాలతో బయటపడగా, మిగిలిన వారి ఆచూకీపై ఆందోళన నెలకొంది. ఈ ఘటనపై రాజమహేంద్రవరం టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సూసైడ్ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. అందులో తమ మరణానికి సాదిక్ ఖాన్ వేధింపులే కారణమని, అలాగే జగదీష్ రెడ్డికి సాదిక్ ఖాన్ కెమికల్ పాయిజన్ ఇచ్చి చంపాడని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

**సర్పవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు..** సూయిసైడ్ నోట్‌లోని అంశాల ఆధారంగా జగదీష్ రెడ్డి తండ్రి కొవ్వూరి భాస్కర్ రెడ్డి సర్ప వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 17న క్రైమ్ నెంబర్ 260/2026 కింద పలు సెక్షన్లతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ బిందు మాధ వ్ ఆదేశాల మేరకు కాకినాడ ఇంచార్జి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు.

**మీరట్‌లో నిందితుడి అరెస్ట్..** విశ్వసనీయ సమాచారం ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ చేరుకుంది. స్థానిక పోలీసుల సహకారంతో ఈ నెల 22న ఉదయం సుమారు 9 గంటలకు నౌచండి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో షేక్ సాదిక్ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం మీరట్‌లోని చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో నిందితుడిని హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ తీసుకున్నారు. అనంతరం నిందితుడిని కాకినాడకు తీసుకొచ్చి కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**పలు కోణాల్లో కొనసాగుతున్న దర్యాప్తు..** మృతుల సూసైడ్ నోట్లు, నిందితుడి పాత్ర, జగదీష్ రెడ్డి మరణానికి సంబంధించిన కారణాలు, అనుమానాస్పద అంశాలు, మతమార్పిడికి సంబంధించిన ఆరోపణలు, మృతులపై నిందితుడు చేసినట్లు పేర్కొన్న బెదిరింపులు తదితర అంశాలపై పోలీసులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, కాల్ డేటా రికార్డులు, వైద్య రికార్డులు, బ్యాంకు లావాదేవీలు తదితర ఆధారాలను శాస్త్రీయంగా పరిశీలిస్తున్నారు.

**దర్యాప్తు బృందానికి ఎస్పీ అభినందనలు..** నిందితుడిని అరెస్ట్ చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందంలో జగ్గంపేట సీఐ బి తిరుపతిరావు, తుని టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం గీతారామకృష్ణ, పోర్ట్ ఇన్‌స్పెక్టర్ పి సునీల్ కుమార్, క్రైమ్ సీఐ పివి త్రినాథ్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ డి దుర్గా శేఖర్ రెడ్డి, ఇంద్ర పాలెం ఎస్సై ఎం వీరబాబు, సర్పవరం ఎస్సై ఎం యేసుబాబు, ఉప్పాడ కొత్తపల్లి ఎస్సై జి వెంకటేష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై టి తులసీరామ్, తుని టౌన్ ఎస్సై జె విజయబాబు తదితరులు ఉన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం సభ్యులను, వారిని పర్యవేక్షించిన కాకినాడ ఇంచార్జి సబ్ డివిజ నల్ పోలీస్ ఆఫీసర్, జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కెవివి సత్యనారాయణలను జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ రివార్డులతో అభినందించారు.

# జీవోలు ఉన్నా నిధులు మంజూరు చేయట్లేదు.. తాళ్లూరి ప్రశాంత్

● మాదిగ వర్గాల స్మశాన వాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మార్పీఎస్ నేతల డిమాండ్..



**గుడివాడ,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** పట్టణంలో మాదిగ వర్గాల స్మశాన వాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ గుడివాడ శాఖ అధ్యక్షుడు తాళ్లూరి ప్రశాంత్, నాయకుల ఆధ్వర్యంలో సంఘీయులు సోమవారం ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ గుడివాడ శాఖ అధ్యక్షుడు తాళ్లూరి ప్రశాంత్ మాట్లాడుతూ.. గుడివాడలో మాదిగ సంఘీయులు దాదాపు 20 ఏళ్లుగా స్మశాన వాటిక సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైలుపేటలో సుమారు వందేళ్ల క్రితం సీఐఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో కేటాయించిన స్మశాన స్థలం ప్రస్తుతం పూర్తిగా నిండిపోయిందన్నారు. దీంతో కొత్తగా మృతదేహాలను ఖననం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం అధికారులకు వినతిపత్రం అందించామని.. 14 రోజులు వేచి చూస్తామని, అప్పటికీ స్పందన లేకపోతే ఆర్టీఐ చట్టం ద్వారా పూర్తి వివరాలు సేకరించి తదుపరి కార్యాచరణ చేపడతామని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దొండపాటి మహేష్, వేసుపోగు ఇమ్మనుయేలు, గూడూరు సురేంద్ర, సంద్రపాటి పాపారావు, వేసుపోగు ఐజక్, వంగేవరపు రవితేజ, వైదిన ఎల్లయ్య, యనమల అదామ్, వేసపోగు ఎసేబు, నారి చిన్నబాబు, మైలవరపు రాజీవ్, తాళ్లూరి ప్రవీణ్, కూకటి పరశయ్య, కూకటి అశోక్, ఎండూరి కుమార్, కవలకుంట్ల, జోసెఫ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ కరాటే స్కూల్ విద్యార్థుల విజయభేరి



**హనుమాన్‌జంక్షన్,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** వైజాగ్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో హనుమాన్‌జంక్షన్, తేలప్రోలుకు చెందిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. సబ్‌జూనియర్ విభాగంలో పాల్గొని పలు పతకాలను సాధించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ తరఫున ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో బి. సంతోషిని, కే. మేఘన నిలవగా, తృతీయ స్థానంలో కే. హారికా ధనలక్ష్మి, కే. శ్రీ వర్షిత, ఏ. తీక్షిక విజయం సాధించారు. బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో కట్టా మనోజ్, షేక్ షఫీయుర్ రెహమాన్, తృతీయ స్థానంలో బి. చోళా సత్యదేవ్, కే. లోకేష్‌కుమార్, ఏ. తేజేశ్వర్ నిలిచారు. కటాస్ విభాగంలో బాలికల్లో ద్వితీయ స్థానంలో కే. మేఘన, తృతీయ స్థానంలో కే. హారికా ధనలక్ష్మి, కే. శ్రీ వర్షిత, ఏ. తీక్షిక, బి. సంతోషిని విజయం సాధించారు. బాలుర విభాగంలో ఏ. తేజేశ్వర్ ప్రథమ స్థానంలో నిలవగా, కట్టా మనోజ్, షేక్ షఫీయుర్ రెహమాన్, బి. చోళా సత్యదేవ్, కే. లోకేష్‌కుమార్ తృతీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా వాడకై కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడుతూ టైగర్ పవర్ క్లబ్ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ తరఫున ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల విజయానికి కోచ్ కట్టా సుధాకర్ చేసిన కృషి అభినందనీయమని తెలిపారు.

# వరలక్ష్మి వ్రతం నిర్వహణకు జాకెట్ ముక్కలు కుంకుమ పసుపు అందజేసిన దంపతులు



**పెనుగంచిప్రోలు,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు వరలక్ష్మి వ్ర తం కు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగర వాస్తవ్యులు దీపిక, లక్ష్మణ్ దంపతులు కుటుంబ సమేతంగా శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ది,04/09/2026 శుక్రవారం రోజు జరగనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వాహణకు కాను ఒక వేయి జాకెట్ ముక్కలు 60 కిలోల కుంకుమ, 15 కిలోల పసుపు ఆలయ చైర్మన్ చుంచు రమేష్, బాబు సమక్షంలో ఆలయ ఏ ఈ వో జంగం శ్రీనివాసరరావు సూపర్ డెంట్ సత్యనారాయణ ఆలయ పూజారులకు అందజేశారు. వారికి ఆలయ చైర్మన్ చుంచు రమేష్ బాబు మరియు అధికారులు ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేసినారు...

# అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రతి అర్హుడికి సీఎంఆర్ఎఫ్ అందేలా కృషి చేస్తా..

-ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భరోసా



**గుడివాడ,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గంలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భరోసా ఇచ్చారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సీఎంఆర్ఎఫ్ కోసం ఎమ్మెల్యే రామును కలిశారు. ప్రజా వేదిక కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరి అర్జీ పత్రాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. దరఖాస్తుల్లో అవసరమైన పత్రాలు లేని వారికి వాటిని సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ము-ఖ్యమంత్రి సహాయనిధి అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, నియోజకవర్గంలోని ప్రాంతాలకు చెందిన టిడిపి నేతలు తేనెల ఏడుకొండలు, మళ్లీ పెద్ది సుబ్రహ్మణ్యం, అరిపిరాల రవి, నంబూరి రాకేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# రైతుల నీటి హక్కుల కోసం 'ఆళ్ల' పోరాటం



**హనుమాన్‌జంక్షన్,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** రాష్ట్ర రైతుల సాగునీటి హక్కుల సాధన కోసం సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు చేస్తున్న పోరాటం అభినందనీయమని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి అన్నారు. ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు జన్మదినం సందర్భంగా సోమవారం హనుమాన్‌జంక్షన్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు నిర్వహించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దయ్యాల రాజేశ్వరరావు,మూల్పూరి సాయికళ్యాణి, గన్నవరం నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు చింతల వెంకట అప్పారావు, బాపులపాడు మాజీ జెడ్పీటీసీ వేగిరెడ్డి పాపారావు తదితరులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావును దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయికళ్యాణి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ సభ్యుడిగా పనిచేసిన ఆళ్ళకు సాగునీటి రంగంపై మంచి అవగాహన ఉందన్నారు. పదవిలో ఉన్నా.. లేకపోయినా కృష్ణా, గోదావరి జలాల హక్కుల కోసం నిరంతరం గళం వినిపిస్తున్నారని తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు ఫిర్యాదుల విభాగం బాధ్యతలు చేపట్టి రైతులను సమన్వయం చేశారని పేర్కొన్నారు. నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల కోసం 9,331 రిట్ పిటిషన్లు దాఖలు చేయించడంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.964 కోట్లు, అనంతరం రూ.868 కోట్లు కలిపి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.1,832 కోట్ల పెండింగ్ బిల్లులను రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులకు అందేలా కృషి చేశారని వివరించారు. గత శాసనసభ ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్, ప్రధాన ఎన్నికల ఏజెంట్‌గా పనిచేసి యార్లగడ్డ వెంకట్రావు విజయానికి కృషి చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పురస్కార్ అవార్డు అందుకున్న గుడివాడ ఆర్కే



**గుడివాడ,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** మెగాస్టార్ చిరంజీవి జన్మదిన సందర్భంగా, గుడివాడ పట్నంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్ మాచర్ల రామకృష్ణ (Rk)కు, పొన్నూరు బ్లడ్ బ్యాంక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పురస్కార్ అవార్డు అందజేసారు. ఈ సందర్భంగా Rk మాట్లాడుతూ సమాజమే దేవాలయంగా భావిస్తూ, పేద ప్రజలకు ఏదో విధంగా సహాయం చేయాలని ఆలోచనతో, నేను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి, పొన్నూరు బ్లడ్ అసోసియేషన్ వారు నాకు ఈ జాతీయ పురస్కార్ అవార్డు అందజేయడం చాలా ఆనందంగా ఉందని, అదేవిధంగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగ గారి కుమార్తె వంగవీటి ఆశ కిరణ్ చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాదె చరణ్, లంక రాంబాబు, అయ్యప్ప, ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

# టీడీపీ నేత మొవ్వ వేణుగోపాల్ జన్మదిన వేడుకలు



**హనుమాన్‌జంక్షన్,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** బాపులపాడు మండల టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మొవ్వ వేణుగోపాల్ (బుజ్జి) జన్మదిన వేడుకలు హనుమాన్‌జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్ టీడీపీ టౌన్ పార్టీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేణుగోపాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేణుగోపాల్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, ఏఎంసీ డైరెక్టర్ గార్లపాటి రాజేశ్వరరావు, రేమల్లె గ్రామ పార్టీ అధ్యక్షుడు కొల్లూరి చంద్రకాంత్, మండల కార్యనిర్వాహక కార్యదర్శి కర్ర ప్రసాద్ పాల్, యూనిట్ ఇన్‌చార్జిలు చలసాని శ్రీనివాస్, పొట్లూరి ఫణి, కోడె రేవంత్, అన్నె చైతన్య, లింగం శ్రీధర్, అక్కినేని గోకుల్, జంపన హరికృష్ణ, అక్కినేని పరమేశ్వరరావు, యార్లగడ్డ సత్యన్నారాయణ, చెరుకూరి రాము తదితరులు పాల్గొన్నారు.

# నోటీసు జారీ.. ఓటు తొలగింపు కాదు..

● అత్యంత పారదర్శకంగా నోటీసులపై విచారణ ● వాస్తవ నిర్ధారణ తర్వాతే నిర్ణయం.. ఓటర్లకు భరోసా ● ఓటుహక్కు పరిరక్షణ కోసమే సర్ సమగ్ర ప్రక్రియ ● ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు నమోదుకూ అవకాశం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా జారీచేస్తున్న నోటీసులపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నోటీసు జారీ అంటే ఓటు తొలగింపు కాదని, అత్యంత పారదర్శకంగా విచారణ తర్వాతే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. అదేవిధంగా ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు కూడా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సోమవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని అయ్యప్పనగర్ స్వర్ణ వార్డు కార్యాలయం వద్ద జరిగిన సర్ నోటీసుల విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. అక్కడకు వచ్చిన వారితో మాట్లాడి క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోల ద్వారా అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోటీసు జారీ అనేది వివరాలను పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించుకునే ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనన్నారు. ఓటుహక్కు పరిరక్షణ కోసమే సర్ సమగ్ర ప్రక్రియ నిర్వహించడం జరుగుతోందని.. దోష రహిత ఓటరు జాబితా లక్ష్యంగా జరుగుతున్న ఈ ప్రక్రియలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటివరకు 1,88,769 నోటీసుల పంపిణీ జరిగిందని.. వీటిలో 61,284 మందికి విచారణ నిర్వహించడం జరిగిందన్నారు. 64,252 మందికి విచారణ షెడ్యూలు గడువు ముగియగా విచారణ కోసం రీషెడ్యూల్ చేయడం జరుగుతోందన్నారు. ఎవరికి ఏ సందేహమున్నా క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు సహాయసహకారాలకు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కొత్తగా ఓటు నమోదుకు వీలుకల్పించే ఫారం-6తో పాటు ఫారం-7, ఫారం-8లు కూడా వారి వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని.. అర్హులైన ప్రతిఒక్కరూ కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను తదితరులు ఉన్నారు.

# ప్రధాన సమాచార కమిషనర్ ను అడ్డుకున్న మేడి కొండూరు పోలీసుల పై చర్యలు తీసుకోండి

● డిజిపికి హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు.

● సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదుపై స్పందించిన హోం శాఖ.



**అవనిగడ్డ,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** రికార్డుల తనిఖీ కోసం గుంటూరు జిల్లా మేడికొండూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ వజ్జా శ్రీనివాసరావును స్టేషన్‌లోకి అనుమతించకుండా అడ్డుకున్న ఘటనపై బాధ్యులైన పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ చేసిన ఫిర్యాదుపై హోంశాఖ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజిత్ స్పందించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రధాన సమాచార కమిషనర్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో సమాన హోదా ఉన్నప్పటికి ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని జంపాన శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన ఆర్టిఐ ప్రధాన సమాచార కమిషనర్ విధులకు ఆటంకం కలిగించిన సిబ్బందిని సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా లకు ఫిర్యాదు చేశారు. జంపాన శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదుపై స్పందించిన హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఘటనపై విచారణ జరిపిందడంతో పాటు బాధ్యులపై అమలులో ఉన్న నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పోలీసు డైరెక్టర్ జనరల్ , మంగళగిరి వారికి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టిఐ కార్యకర్తలు బేతపూడి జోగేశ్వరరావు, బొల్లా శివపార్వతి లు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

# నకిలీ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయాలి కలిదిండి సత్యవతి

● ప్రాణ రక్షణ కల్పించాలని కలెక్టరు కు వినతి



**కాకినాడ,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** తొండంగి మండలం రావికంపాడు లో కలి దండి సత్యవతికి చెందిన ఎకరం భూమిని నకిలీ రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని దానిని తక్షణమే రద్దు చేయాలని పి.వి. రావు మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయ సలహాదారు,కొంగు నూకరాజు కోరారు. సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన పీజీ ఆర్ ఎస్ లో బాధితురాలు కలిదిండి సత్యవతి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కదిలిదిండి సత్యవతి తరుపు న్యాయవాది నూకరాజు పాత్రికేయులతో మాట్లాడుతూ సత్యవతికి రావికంపాడు ఎకరం భూమి ఉందని , దానిని గొల్లప్రోలు గ్రామానికి చెందిన రాజమహేంద్రవరం మహాలక్ష్మి పేరు మీద నకిలీ డాక్యుమెంట్ 2017లో సృష్టించడం జరిగిందన్నారు. తిరిగి తొండంగి మండలానికి చెందిన ఆదం నాగమల్లిక పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. 2026 మార్చిలో నాగ మల్లిక కూతురు మౌనిక పేరు మీద మరోసారి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని,రెవెన్యూ అధికారులను తక్షణమే చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ ఆదేశించడం జరిగిందన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో నకిలీ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక పోరులో సత్తా చాటుదాం - పిన్నెంటి



**కృత్తివెన్ను,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలంలోని మునిపేడ పంచాయతీ బూత్ నెంబర్ 171.172 లో పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ ఆదేశాలతో కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య ఇంటింటికి మహా కూటమి ప్రభుత్వం రెండు ఏళ్ళ నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్నెంటి రత్తయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం 5 ఏళ్ళ పాలనలో రాష్ట్రం పూర్తిగా అభివృద్ధికి కుంటిపడిందని చదువుకున్న యువత చేతిలో డిగ్రీలు ఉన్న ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వాలంటీర్ లుగా 5000 జీతంతో అష్ట కష్టాలు పడ్డారు అని ప్రభుత్వ ఉద్యోగం కోసం కష్టపడి చదువుకున్న ఎంతోమంది నిరుద్యోగ పట్టభద్రులు ఏజ్ లిమిట్ దాటిపోయి ఫిష్ మార్టులు వైన్ షాపుల్లో ఉపాధికి వెళ్లారు అని కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు ఏళ్ళలోనే మెగా డి ఎస్ స్సి ద్వారా 16000 పైగా అధ్యాపక పోస్టులు పొంది ఈ రోజు గౌరవ ప్రదంగా జీవితం ప్రారంభించారు అని పిన్నెంటి రత్తయ్య అన్నారు. అలాగే వైసీపీ విధ్వంస పాలనలో కనీసం కొత్త రోడ్లు వెయ్యడం మాట దేవుడు ఎరుగు కనీసం గోతులు పూడ్చమ్మన్నా కూడా అతి, గతి లేదని మహా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 2 ఏళ్ళల్లో మారుమూల పల్లెటూరు లలో, అటవీ ప్రాంతాల్లో కూడా అద్భుతమైన రోడ్లు, మౌలిక వసతులు ఏర్పాటు అయ్యాయి అని, ఒక వైపు రాజధాని అమరావతి ని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తూనే, మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవ నాడి పోలవరం పనులు శర వేగంగా జరుగుతున్నాయి అని పిన్నెంటి రత్తయ్య అన్నారు. ఇంటింటికి కూటమి ప్రభుత్వం ప్రచారంలో మహా కూటమి ప్రభుత్వం పనితీరుకు అద్భుతమైన స్పందన వస్తుంది అని ఇప్పుడు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా మహా కూటమి నాయకులం అందరం సైనికులం అయ్యి మన నాయకుడు కాగిత కృష్ణా ప్రసాద్ సూచించిన కూటమి అభ్యర్థులు నియోజకవర్గంలోని స్థానిక ఎన్నికల్లో మునిసిపల్, పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ యిలా ఎందులో బరిలో ఉన్న వారిని అత్యంత భారీ మెజారిటీ తో గెలిపించుకుని శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్, ఎంపీ వల్లభనేని బాల సౌరీ లకు బహుమతిగా అందిద్దాం అని పిన్నెంటి రత్తయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మహా కూటమి స్థానిక నాయకులు దాసరి ఆదినారాయణ గుమ్మళ్ళ రఘు పాలపర్తి రాజేష్ కాకర బాల సౌరీ తోట జయబాబు ఇల్లూరి సుబ్బారావు దాసరి మురళి గంట బాల మురళి కృష్ణా కాకర మోహన్ రావు జె వి ఆర్ యంగళ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మోగా వైద్య శిబిరం..

● కీళ్ళు,ఎముకలు సంరక్షణకు వ్యక్తిగత బాధ్యత అవసరం. ● ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి.

● లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి.






**పరవాడ/అనకాపల్లి,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** ప్రజల ఆరోగ్యం పై "లీ ఫౌండేషన్" ప్రత్యేక దృష్టి పెడుతుందని,ఎముకలు,కీళ్లు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి పేర్కొన్నారు. గుర్లవానిపాలెం, పరవాడ మండలం, అనాకాపల్లి జిల్లాలోని పోర్టికో కమ్యూనిటీతో కలిసి లీ ఫౌండేషన్ స్థానిక ప్రజల కోసం ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరం ద్వారా మొత్తం 80 మంది లబ్ధి పొందారు. ఈ శిబిరంలో ఆంత్రోపోమెట్రిక్ కొలతలు , నడుము-నొసలు నిష్పత్తి , హిమోగ్లోబిన్, ర్యాండమ్ బ్లడ్ షుగర్, రక్తపోటు, శరీర నిర్మాణం , ఎముకల ఖనిజ సాంద్రత పరీక్షలు నిర్వహించడంతో పాటు డాక్టర్, న్యూట్రిషనిస్ట్ మరియు యోగా థెరపిస్ట్‌ల సలహాలు, సంప్రదింపులు అందించారు. ఈ సందర్భంగా లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ ప్రజలు నిత్యం ఆరోగ్యంగా ఉండే రోజు జాగ్రత్తలు తీసుకోవాలని,ఎముకలు,కీళ్లు కాపాడుకునేందుకు నాణ్యమైన ఆహారం తప్పనిసరని లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి అన్నారు, ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సరోజిని, డాక్టర్ రాధిక కిరణ్, న్యూట్రిషనిస్టు మాధురి, క్రాంతి, యోగా థెరపిస్ట్ అఖిల్ సూర్య తేజ, లీ టీమ్ మరియు పోర్టికో కమ్యూనిటీ ప్రెసిడెంట్ కాశీప్రసాద్ పాల్గొన్నారు.

# హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఘనంగా "ఒగ్గు కథ యూనివర్స్ 2026 హనర్స్" రాష్ట్ర స్థాయి పురస్కారాల ప్రధానం

● ఒగ్గు కళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి.. బేరి రామచందర్ యాదవ్





**హైదరాబాద్,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** తెలంగాణకు చెందిన గొప్ప జానపద కళారూపమైన ఒగ్గు కథ పరిరక్షణ, ప్రాచుర్యం మరియు కళాకారుల గౌరవార్థం "ఒగ్గు కథ యూనివర్స్ 2026 హనర్స్" హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎంపికైన 25 మంది ప్రముఖ ఒగ్గు కథ కళాకారులను ఎంపిక చేసి హైదరాబాద్ లోని సెంట్రల్ యూనివర్సిటీలోని సావిత్రి బాయి పూలే ఆడిటోరియంలో కళాకారుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒగ్గు కథను తరతరాలకు అందిస్తూ, ఈ సంప్రదాయ కళారూపాన్ని సజీవంగా కొనసాగిస్తున్న కళాకారులను గౌరవించడం తెలంగాణ జానపద కళా చరిత్రలో ఒక విశిష్టమైన సందర్భమని కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు అభిప్రాయపడ్డారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ కార్యక్రమానికి లేఖ ద్వారా తన సందేశాన్ని పంపగా సభలో చదివి వినిపించారు. ఆయన తన సందేశంలో, "25 మంది ప్రముఖ ఒగ్గు కథ కళాకారులను సన్మానించడం అభినందనీయమైన విషయమని తెలిపాయి. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రొఫెసర్ జాలీ పుతుశ్శేరి మరియు డా. జి. కుమారస్వామిలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రియాంక, హైదరాబాద్ విశ్వవిద్యాలయం మాస్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన, శిర్తా వ్యాఖ్యాతలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్, ప్రొఫెసర్ వెంకట రమణ, శ్రీకో ప్రాజెక్ట్స్ ఛైర్మన్ మెచినేని శ్రీనివాసరావు, ప్రముఖ సినీ నటుడు బలగం సుధాకర్ రెడ్డి, జ్యోతి రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. జ్యోతి రెడ్డి దుడిపాల, హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మీడియా ఆర్ట్స్ హెడ్,జీ డా. జి. కుమారస్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రావుల కృష్ణ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం; ప్రొఫెసర్ జాలీ పుతుశ్శేరి, హెడ్, సెంటర్ ఫర్ ఫోక్ కల్చర్ స్టడీస్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం; ప్రముఖ టెలివిజన్ నటుడు విజయ్ యాదవ్; శివ పాలెపు, అధ్యక్షుడు, స్టూడెంట్ యూనియన్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, సింగారపు రాజ్ కుమార్, సెలక్షన్ కమిటీ హెడ్, తెలంగాణ రచయిత, కవి ప్రవీణ్ మాచవరం, ప్రముఖ సామాజిక సేవకులు, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్, జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నంద కుమార్ యాదవ్ , కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులందరూ నిర్వాహకులను అభినందిస్తూ, తెలంగాణ జానపద కళాకారులకు గుర్తింపు కల్పించడం, రాష్ట్ర జీవన సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు పరిరక్షించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మరో ప్రధాన ఆకర్షణగా "గాడ్స్ ఇన్ ది వాయిస్" అనే ఒగ్గు కథపై రూపొందించిన ఆంగ్ల భాషలో తొలి డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. ఒగ్గు కథలోని కళాత్మక వైభవం, సాంస్కృతిక ప్రాధాన్యతను సమగ్రంగా ఆవిష్కరించిన ఈ డాక్యుమెంటరీకి విశేష ప్రశంసలు లభించాయి. సంప్రదాయ ఒగ్గు కథ కళారూపాన్ని డాక్యుమెంటరీ చిత్రీకరణ ద్వారా విస్తృత ప్రేక్షకులకు చేరువ చేసినందుకు డా. కుమారస్వామి జి. మరియు ఆయన బృందాన్ని అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి ముందు నిర్వహించిన బతుకమ్మ వర్క్‌షాప్‌లో 30 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పరిశోధకులు వసుమతి, తేజస్విని, శ్రీనిక, రజిత, కవిత, సుప్రజ తదితరుల చురుకైన భాగస్వామ్యంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. బతుకమ్మకు సంబంధించిన సాంస్కృతిక సంప్రదాయాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటితో అనుసంధానమయ్యే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభించింది. కార్యక్రమ నిర్వహణలో పీహెచ్‌డీ పరిశోధకుడు సుమంత్ పెండెం చురుకైన పాత్ర పోషించారు. "ఒగ్గు కథ యూనివర్స్ 2025 హనర్స్" విజయవంతంగా ముగియడం ద్వారా ఒగ్గు కథ కళాకారులకు మరింత విస్తృతమైన గుర్తింపు కల్పించే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు పడింది. తెలంగాణ సాంస్కృతిక గుర్తింపులో ఒగ్గు కథ ఒక సజీవమైన, వైవిధ్యభరితమైన, శక్తివంతమైన జానపద కళారూపంగా కొనసాగుతోందని ఈ కార్యక్రమానికి మెచినేని శ్రీనివాస రావు ట్రస్ట్ మరియు తెలంగాణ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ రఘునాథ్ యాదవ్ సహకారం అందించారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు నిర్వహకులు తెలిపారు. బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ ఒగ్గు కళాకారులను గుర్తించి వారిని సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు. కళాకారులను గుర్తించి అవార్డులు అందించిన డా. జ్యోతి రెడ్డి దుడిపాల, డా. జి. కుమారస్వామిలని అభినందించారు.

# పర్యావరణ పరిరక్షణకు సేయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థుల కృషి..



**కృత్తివెన్ను,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** బంటుమిల్లి స్థానిక సెయింట్ జాన్స్ హై స్కూల్లో పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు ఐటిసి వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్షిప్ లో సేయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థులు తాము సేకరించిన పాత పుస్తకాలు ఏజిఎస్ నిర్వహకులకు అందజేశారు. ఈ సందర్భంగా సేయింట్ జాన్స్ స్కూల్ కరస్పాండెంట్ సాబు జాన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్కువ మొత్తంలో ఓల్డ్ బుక్స్ సేకరించి ప్రథమ స్థానంలో నిలిచిన ఎం పూజిత 8 క్లాస్ కి ప్రథమ బహుమతి ఇవ్వడం జరిగింది అని చెప్పారు. వాచ్ ప్రతినిధి రాజు మాట్లాడుతూ ఒక టన్ను పేపర్ తయారీ కావాలంటే 17 చెట్లు అవసరమన్నారు ప్రతి ఒక్కరూ రీసైక్లింగ్ సహకరిస్తే చెట్లను కాపాడుకోవచ్చు అన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ఉత్తమంగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం సోమవారం బహుమతులు , ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ప్రతినిధి రాజు మరియు ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ సాబు రువినా సాబు మరియు పీటీ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

# కంకిపాడు పరిధిలో భారీగా గంజాయి స్వాధీనం - ఏడుగురు నిందితుల పట్టివేత



**కంకిపాడు,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** కంకిపాడు సర్కిల్ పరిధిని పూర్తిగా గంజాయి రహిత ప్రాంతంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గన్నవరం డిఎస్పి ధర్మేంద్ర అన్నారు. కంకిపాడు మండలం, కంకిపాడు పోలీస్ స్టేషన్లో గన్నవరం డిఎస్పీ ధర్మేంద్ర, కంకిపాడు సిఐ బిబి రవికుమార్, ఎస్. ఐ దాస్ విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ కృష్ణా జిల్లా ఎస్పీ శ్రీ విద్యాసాగర్ నాయుడు, ఖూా గారి ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. రవికుమార్, ఎస్సై దాస్ మరియు సిబ్బంది సమర్థవంతంగా దాడి చేసి గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నామన్నారు. ముందస్తు సమాచారం మేరకు కంకిపాడు పోలీసులు పునాదిపాడులోని రోచార్ప్ కంపెనీ సమీపంలో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో వెల్లడైన వివరాల ఆధారంగా, పునాదిపాడు -- ఉప్పులూరు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మరో నలుగురితో పాటు మొత్తం ఏడుగురు సభ్యుల ముఠాను పట్టుకున్నట్లు తెలిపారు.

**మొత్తం నిందితులు: 7 గురు**

**మేజర్లు (4 గురు):** న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించడం జరుగుతోంది. **మైనర్లు (3 గురు):** జ్యువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచి జ్యువైనల్ హోమ్‌కు తరలిస్తున్నాము.

స్వాధీనం చేసుకున్న సొత్తు గంజాయి 7 కేజీల 125 గ్రాములు సుమారు దీని విలువ మూడున్నర లక్షలు. గంజాయి రవాణా, విక్రయాలకు ఉపయోగిస్తున్న 4 దొంగిలించిన ద్విచక్ర వాహనాలు (బైకులు) 5 మొబైల్ ఫోన్లు నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కంకిపాడు పోలీసు అధికారులను, సిబ్బందిని మరియు సహకరించిన రాష్ట్ర ఈగల్ టీం ను జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించి, డి. ఎస్. పి ధర్మేంద్ర చేతుల మీదుగా రివార్డులను అందజేశారు. గంజాయి అక్రమ రవాణా చేసినా లేక వినియోగించినా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం టంగుటూరు ప్రకాశం పంతులు

-ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ టీచర్ బి యస్ నారాయణరెడ్డి



**మార్కాపురం,ఆగష్టు 24 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలోని కాశినాయన దేవాలయం ఆవరణము నందు 150 వ జయంతి సందర్భంగా ఈ రోజు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు పెద్దలు పాల్గొని మాట్లాడుతూ చాలా గొప్ప నిజాయితీపరుడని ఆనాడే కోట్ల రూపాయల ఆస్తులు ప్రజలకు దానం చేసిన గొప్ప ఆదర్శ పురుషుడని టంగుటూరి ప్రకాశం పంతులు గారిని కొనియాడారు. 1872 ఆగస్టు 23న గుంటూరు జిల్లాలోని కనపర్తి గ్రామంలో జన్మించిన ప్రకాశం పంతులు సాధారణ కుటుంబం నుండి అసాధారణ స్థాయికి ఎదిగిన ఏకైక గొప్ప వ్యక్తి అని కొనియాడారు న్యాయవాదిగా విశేష ఖ్యాతి మద్రాసులో సంపాదించుకున్నాడు న్యాయవృత్తి వదిలేసి దేశ సేవకు అంకితమయ్యాడు ఆనాడు గాంధీజీ పిలుపుతో స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొన్న గొప్ప వ్యక్తి అనంతరం ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారన్నారు. బి యస్ నారాయణరెడ్డి ప్రకాశం పంతులు గారి ముని మనమనుడు టంగుటూరి రామదాసు తో ఫోన్లో మాట్లాడి వారి హైదరాబా దులో ఉన్న వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత లెక్చరర్ వడ్డీ వీరారెడ్డి విశ్రాంత ఉపాధ్యా యులు ఖాతా శ్రీనివాసరెడ్డి ఖాతా అనంతమ్మ ఆధ్యాత్మిక వక్త సూరే కృష్ణారావు, వేమిరెడ్డి రామలింగారెడ్డి ఉపాధ్యాయులు ఏరువ రమణారెడ్డి విశ్రాంత సూపర్నెంట్ పాలుగుళ్ళ కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188